# అందరికీ టీకా ఔషధ ఆరోగ్య గొడుగులు పట్టలేమా !

## (16 మార్చి "జాతీయ టీకా దినోత్సవం" సందర్భంగా)

"చికిత్స కన్న నివారణే మిన్న" అనే నినాదం అనాదిగా వింటూనే ఉన్నాం. ప్రాణాంతక వ్యాధులను జీవితకాలం పాటు తరిమేయగల దివ్య రక్షణ కవచంగా టీకా ఔషధాలను ప్రయోగిద్దాం, అందరికీ టీకాలను వేయించే ప్రయత్నాలు చేయడం మన కనీస భాద్యత. టీకా ఔషధాలతో వ్యక్తులు, కుటుంబాలు, పౌర సమాజం, ప్రపంచ మానవాళి అనేక వ్యాధులను కట్టడి చేయడం నిరంతర ఉద్యమంగా కొనసాగుతున్న తరుణంలో టీకాల ప్రాధాన్యాన్ని సామాన్య జనులకు వివరించడానికి ప్రతి ఏట 16 మార్చిన "జాతీయ టీకా దినోత్సవం" లేదా "నేషనల్ వ్యాక్సినేషన్ డే" పాటించుట 1995 నుంచి కొనసాగుతున్నది. తీవ్ర ప్రభావాలను చూపే అనేక భయంకర అంటువ్యాధులను కట్టడి చేయడానికి వినియోగించే అత్యంత సమర్థవంతంగా పని చేయగల టీకా ఔషధాలు చవకగా లేదా ప్రభుత్వం చేత ఉచితంగా కూడా పంపిణీ చేయబడుతున్నాయి.

పల్స్ పోలియో ప్రోగ్రామ్ :

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, సవాలుగా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం పోలియో నిర్మూలనకు దేశవ్యాప్తంగా "పల్స్ పోలియో ప్రోగ్రామ్" ఫలితంగా భారతాన్ని పోలియో రహిత దేశంగా కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ 2014లో ప్రకటించడంతో జరిగింది. ఇదే స్ఫూర్తితో దేశ సరిహద్దుల నుంచి హెపటైటిస్, టిబి, డిఫ్తీరియా, పెర్ట్యుసిస్, టెటనస్, పోలియోమైలిటిస్, రోటావైరస్య, జపనీస్ ఎన్‌సిఫలైటిస్, రుబెల్లా, న్యూమోకోకల్ వ్యాధి, మిసిల్స్ లాంటి వ్యాధులను తరిమేయడానికి భారత ప్రభుత్వం టీకాలను ఉచితంగా పిల్లలకు, గర్భిణి స్త్రీలకా అందుబాటులో ఉంచడం హర్షదాయకం. జాతీయ టీకా దినం వేదికగా టీకా ఔషధాల పట్ల అవగాహన, టీకాల పట్ల భయాలను లేదా అపార్థాలను తొలగించడం, టీకా ఉద్యమంలో భాగం కావడం, ప్రభుత్వ టీకా కార్యక్రమాలకు ప్రచారం నిర్వహించడం, టీకా ఉద్యమానికి తమ సేవలను అందిస్తున్న వైద్య ఆరోగ్య కార్యకర్తలను సన్మానించుకోవడం నిరంతరం కొనసాగాలి.

జాతీయ టీకా దినోత్సవం-2026 ఇతివృత్తం:

2026 జాతీయ టీకా దినోత్సవ ఇతివృత్తంగా "అందరికీ టీకాలు మానవీయ సుసాధ్యాలు" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. మారుమూల ప్రాంతాలకు సహితం టీకా ఔషధాలు అందించడం, పౌర సమాజ చేతనం, అంతర్జాతీయ స్థాయి సహాయ సహకార సమన్వయాలు కలిపించడం నిత్యం కొనసాగాలి. "అందరికీ టీకాలు సుసాధ్యం" అనే నినాదాన్ని నిజం చేసి చూపడం జరగాలి. ప్రతి ఏట 2.67 కోట్ల శిశువులకు, 2.9 కోట్ల గర్భిణి స్త్రీలకు "యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్" మాద్యమంగా అవసర టీకాలు అందించడం కొనసాగుతున్నది. 2014లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక "మిషన్ ఇంద్రధనుస్సు" కార్యక్రమంలో భాగంగా టీకాలు దేశవాసులందరి ముంగిట ప్రత్యక్షం అవుతున్నాయి.

ప్రమాదకర అంటురోగాల కట్టడి, శిశు మరణాలను తగ్గించడం, సామాజిక ఆరోగ్య భాగ్యాలను పెంచడం, చవకగా టీకాలను అందుబాటులో ఉంచడం, సమాజ రోగనిరోధక శక్తిని పెంచడం లాంటి ప్రధాన లక్ష్యాలతో కొనసాగుతున్న టీకా ఉద్యమాలను ప్రోత్సహించడం, సమాజ చైతన్యానికి పూనుకోవడం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహిద్దాం, టీకాస్త్రంతో ప్రాణాంతక వ్యాధులను తరిమేద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక



సంగారెడ్డి, మార్చి 15 (నేటి నిజం ప్రతినిధి) పవిత్రమైన రంజాన్ మాసం సోదరభావం, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

### మిలాద్ గ్రౌండ్‌లో ఇఫ్తార్ విందు

రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని మిలాద్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెత్కర్, టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రంజాన్ మాసం శాంతి, సహకారానికి ప్రతీక

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రేమ, శాంతి, సహకారం పెంపొందించే పవిత్రమైన కాలమని తెలిపారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును పవిత్రం చేసుకోవడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు.

### మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ముస్లిం సోదరుల అభ్యున్నతికి విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

### తెలంగాణ ఐక్యతకు నిలయం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని మతాలు, వర్గాలు కలిసి జీవించే సంస్కృతికి నిలయమని తెలిపారు.

### ఐక్యతను పెంపొందించే రంజాన్

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉపవాసం ద్వారా ఆత్మశుద్ధి సాధించడం, పేదలకు దానం చేయడం వంటి గొప్ప విలువలను రంజాన్ మాసం గుర్తు చేస్తుందని చెప్పారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, మంత్రులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో రెండు బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు భూమిపూజ నిర్వహించిన బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 16: మహారాష్ట్ర పర్యటనలో నేడు రెండవ రోజున కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, చంద్రపూర్‌లో రెండు బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు భూమి పూజ నిర్వహించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముర్పార్ గని మూసివేత స్థలంలో జరుగుతున్న కార్యకలాపాలను శ్రీ కిషన్ రెడ్డి సమీక్షించారు. అనంతరం చిమూర్ వద్ద సంబంధిత భాగస్వాములతో కలిసి మైన్ క్లోజర్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

భూమి పూజ నిర్వహించిన ఈ రెండు బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులు భారత ప్రభుత్వ పథకం కింద ఆర్థిక ప్రోత్సాహకాలు పొందేందుకు ఎంపికైన ఏడు ప్రాజెక్టులలో ఉన్నాయి. ఈ రెండింటిలో ఒకటైన గ్రేటా ఎనర్జీ సంస్థ నిర్మిస్తున్న గ్యాసిఫికేషన్ టెక్నాలజీ ఆధారిత ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్. సుమారు 130 ఎకరాల విస్తీర్ణంలో దీనిని అభివృద్ధి చేస్తున్నారు. 0.4 ఎంటీపీఏ సామర్థ్యం కలిగిన ఈ స్వతంత్ర ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ (ఐఎస్పీ) రోజుకు 1490 టన్నుల సామర్థ్యం కలిగిన కార్బన్ క్యాప్చర్ అండ్ యుటిలైజేషన్ సిస్టమ్ (సీసీయూఎస్)ను కలిగి ఉంటుంది. ఈ ఇంటిగ్రేటెడ్ స్టీల్ కాంప్లెక్స్‌లో 'కోల్ గ్యాసిఫికేషన్ ఐలాండ్' ఉంటుంది, ఇది డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్ (డీఆర్ఐ) ఉత్పత్తి కోసం బొగ్గు ఆధారిత సిన్‌గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తుంది.

రెండవ ప్రాజెక్టు న్యూ ఎరా క్లీన్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన 'సమగ్ర బొగ్గు గ్యాసిఫికేషన్, క్లీన్ ఫ్యూయల్స్ (స్వచ్ఛమైన ఇంధనాలు)' ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు స్వదేశీ బొగ్గును ఎరువులు, మైనింగ్, టెక్స్‌టైల్స్, ప్యాకేజింగ్ వంటి వివిధ రంగాలలో ఉపయోగించే కీలకమైన పారిశ్రామిక రసాయనాలు, ఇంధనాలుగా మారుస్తుంది. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, ఏటా 2.5 మిలియన్ మెట్రిక్ టన్నుల పైగా బొగ్గును ప్రాసెస్ చేస్తాయని అంచనా.

కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంధన స్వయం సమృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, వికసిత భారత్ లక్ష్యాల సాధనలో బొగ్గు గ్యాసిఫికేషన్ ఒక ముఖ్యమైన ఆధారంగా మారుతోందని అన్నారు. మంజూరైన 7 బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులలో 4 మహారాష్ట్రలోనే రాబోతున్నాయని ఆయన తెలిపారు. బొగ్గు గ్యాసిఫికేషన్ వల్ల దిగుమతులు తగ్గడమే కాకుండా, విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని, పారిశ్రామిక సరఫరా వ్యవస్థలు బలోపేతం అవుతాయని మంత్రి పేర్కొన్నారు.

ఈ రెండు ప్రాజెక్టులలో రూ. 10,000 కోట్లకు పైగా పెట్టుబడి పెడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 2,000 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అంతకంటే ఐదు రెట్లు ఎక్కువ మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా ఉత్పత్తిని ప్రారంభిస్తాయని, బాధ్యతాయుతమైన మైనింగ్, స్వచ్ఛమైన బొగ్గు సాంకేతికతలలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన ముర్పార్ అండర్ గ్రౌండ్ మైన్ (భూగర్భ గని) మూసివేత స్థలాన్ని కూడా మంత్రి శ్రీ కిషన్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ గనిలో బొగ్గు ఉత్పత్తి 2003లో ప్రారంభమైంది. అయితే, ఈ ప్రాంతాన్ని తడోబా-అంధారి టైగర్ రిజర్వ్‌కు చెందిన పర్యావరణ సున్నిత ప్రాంతం (ఎకో-సెన్సిటివ్ జోన్)గా ప్రకటించడంతో, 2022లో ఈ గనిని మూసివేశారు.

ఈ సందర్భంగా శ్రీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ, గని మూసివేత అనేది ఒక ప్రాజెక్టు ముగింపు కాదని, సుస్థిరాభివృద్ధి దిశగా ఒక కొత్త ఆరంభమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడానికి, గనులు తవ్విన ప్రాంతంలో సహజ వనరులను సంరక్షించడానికి గని మూసివేత ప్రక్రియను శాస్త్రీయంగా, క్రమపద్ధతిలో అమలు చేయాలని ఆయన చెప్పారు. గని మూసివేత ప్రణాళికల్లో స్థానిక వర్గాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వివిధ చొరవల ద్వారా, మూసివేసిన గనులను సామాజికంగా, ఆర్థికంగా, పర్యావరణ పరంగా ఉపయోగకరమైన ఆస్తులుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు.

ముర్పార్ భూగర్భ గని గురించి వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ హరీష్ దుహన్ మాట్లాడుతూ, ఈ గని ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 9,95,926 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ఈ గనికి సంబంధించిన తుది గని మూసివేత ప్రణాళిక)ను సంస్థ బోర్డు 2026, జనవరి 19న ఆమోదించింది. ఈ గనిలో పనిచేస్తున్న సుమారు 426 మంది ఉద్యోగులను ఉమ్రేర్ ప్రాంతంలోని ఇతర గనులకు బదిలీ చేసినట్లు ఆయన వివరించారు.

నిబంధనల ప్రకారం ముర్పార్ గనిలోని అన్ని మైనింగ్ మౌలిక సదుపాయాలను తొలగించడం జరిగింది. అయితే, జిల్లా యంత్రాంగం సిఫార్సు మేరకు మేనేజర్ కార్యాలయం, క్యాంటీన్ భవనాన్ని సామాజిక అవసరాల కోసం అలాగే ఉంచారు. గని మూని వేతకు సంబంధించిన అన్ని భౌతిక పనులు, మూడేళ్లపాటు నిర్వహించాల్సిన పర్యావరణ పర్యవేక్షణ కూడా విజయవంతంగా పూర్తయ్యాయి. జబల్‌పూర్‌లోని ట్రాపికల్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎఫ్ఆర్ఐ) సహకారంతో 2026 జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య గని ప్రాంతంలోని ఐదు హెక్టార్ల భూమిలో అడవుల పెంపకం పనులు చేపట్టనున్నారు. అలాగే, సమీప గ్రామాల ప్రజల కోసం ఎనిమిది ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించగా, సుమారు 715 మంది లబ్ధి పొందారు.

చంద్రపూర్ జిల్లా యంత్రాంగం 2025, జూన్ 12న మైన్ క్లోజర్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసింది. దీని ద్వారా గని మూసివేత తర్వాత ఆ ప్రాంత సుస్థిరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థానిక వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఒక ప్రణాళికను సిద్ధం చేశారు. దీనితో పాటు, గని మూసివేత వల్ల కలిగే సామాజిక ప్రభావాలను అధ్యయనం చేయడానికి, సామాజిక అభివృద్ధి, జీవనోపాధి ప్రణాళిక)ను రూపొందించడానికి 'సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్' ప్రక్రియను కూడా ప్రారంభించారు.

గని మూసివేత స్థలాన్ని సందర్శించిన అనంతరం శ్రీ కిషన్ రెడ్డి చిమూర్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, మైన్ క్లోజర్ అడ్వైజరీ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ మైన్ క్లోజర్ నోడల్ ఆఫీసర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కన్సల్టెంట్లు, స్థానిక గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు. గని మూసివేత తర్వాత ఆ ప్రాంత సమగ్ర, సుస్థిరాభివృద్ధి గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సనోజ్ కుమార్ ఝా, కోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ శ్రీ బి. సాయిరాం, బొగ్గు మంత్రిత్వ శాఖ, సీఐఎల్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశపు 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'కి నేడు కేంద్ర బిందువుగా ఈశాన్య ప్రాంతం..

## ఇది భారత్‌ను ఆగ్నేయాసియాతో కలిపే వారధిలా మారుతోంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 16: అస్సాంలోని సిల్చార్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తూ.. సంస్కృతి, చైతన్యానికి నిలయమైన బరాక్ లోయను సందర్శించడం తనకు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతినిస్తుందని పేర్కొన్నారు. సిల్చార్ నగరం ఈ లోయకు ఒక ప్రవేశ ద్వారం వంటిదని.. ఇక్కడ చరిత్ర, భాష ఒక ప్రత్యేకమైన ప్రాంతీయ గుర్తింపును తీసుకొచ్చాయని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. బెంగాలీ, అస్సామీ, గిరిజన సంప్రదాయాలు సామరస్యంతో వర్ధిల్లే ఈ ప్రాంత వైవిధ్యమే దీని అసలైన బలమని శ్రీ మోదీ తెలిపారు. ''బరాక్ లోయ వైవిధ్యమే దాని గొప్ప ఆస్తి. ఇది పౌరుల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తుంది" అని శ్రీ మోదీ అన్నారు.

ఈ ప్రాంతంలోని సారవంతమైన మైదానాలు, తేయాకు తోటలు ఎంతో కాలంగా స్థానిక ఆర్థిక వ్యవస్థకు, వాణిజ్య మార్గాలకు వెన్నెముకగా నిలిచాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. నేడు ప్రారంభించిన వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు, బరాక్ లోయను మొత్తం ఈశాన్య భారతానికే ఒక రవాణా కేంద్రంగా మరింత శక్తిమంతం చేస్తాయని పేర్కొన్నారు. రైల్వే, రహదారులు, విద్యా రంగాల్లో చేపట్టిన ఈ కార్యక్రమాలను, స్థానిక యువతకు అపారమైన ఉపాధి అవకాశాలను కల్పించేలా రూపొందించినట్లు శ్రీ మోదీ తెలిపారు. ఈ ప్రాంతం ఇప్పుడు కేవలం రాష్ట్రానికే కాకుండా, పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్, ఈశాన్య ప్రాంతాలను అనుసంధానించేలా రూపుదిద్దుకుంటోందని అన్నారు. ''బరాక్ లో ఈశాన్య భారత దేశానికి ప్రధాన రవాణా, వాణిజ్య కేంద్రంగా మారబోతోంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని దేశపు 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'కి కేంద్ర బిందువుగా మారుస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాంతపు గత పారిశ్రామిక వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీ మోదీ తెలిపారు. రూ. 24,000 కోట్ల వ్యయంతో చేపట్టనున్న షిల్లాంగ్-సిల్చార్ హైస్పీడ్ కారిడార్‌కు నేడు శంకుస్థాపన చేయడం ఒక చారిత్రక మైలురాయిగా ప్రధానమంత్రి అభివర్ణించారు. ఈ యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్.. ఈశాన్య ప్రాంతంలో మొదటిదని, ఇది దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న నిరీక్షణకు ముగింపు పలుకుతుందని ఆయన అన్నారు. ఈ కారిడార్ సిల్చార్‌ను మిజోరాం, మణిపూర్, త్రిపురతో అనుసంధానిస్తుందని, ఆగ్నేయాసియాలోని భారీ మార్కెట్లకు చేరువ చేస్తుందని తెలిపారు. ఈ అనుసంధానం స్థానిక పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటక రంగాలకు అపారమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. ''బరాక్ లోయ ఒక అత్యున్నతమైన భవిష్యత్తుతో అనుసంధానం కాబోతోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

కొత్తగా నిర్మించిన సిల్చార్ వంతెనతో చాలా కాలంగా నగర ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ మౌలిక సదుపాయం సిల్చార్ మెడికల్ కాలేజ్, నీట్, అస్సాం యూనివర్సిటీ విద్యార్థుల సమయాన్ని ఆదా చేసి, వారికి ఒక గొప్ప వరంగా మారుతుందని ఆయన అన్నారు. అస్సాం రైల్వే వ్యవస్థలో 2,500 కిలోమీటర్లకు పైగా విద్యుదీకరణ పూర్తికావడంతో ప్రయాణాలు మరింత వేగవంతం అవుతాయని శ్రీ మోదీ తెలిపారు. "అత్యంత వేగవంతమైన, స్వచ్ఛమైన రైలు రవాణా, బరాక్ లోయ సహజ సిద్ధమైన పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది'' అని పేర్కొన్నారు.

అస్సాం అభివృద్ధిలో లోయలోని తేయాకు తోటల కార్మికులు, రైతులు అపారమైన కృషి చేశారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇప్పటివరకు అస్సాం రైతులకు రూ. 20,000 కోట్లకు పైగా నిధులు బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు. నిన్ననే బరాక్ లోయలోని వేలాది మంది రైతులు కూడా తమ బ్యాంకు ఖాతాల్లో నగదును అందుకున్నారని శ్రీ మోదీ గుర్తుచేశారు. ఈ సహాయం రైతులకు వ్యవసాయానికి సంబంధించి చిన్నపాటి లేదా ముఖ్యమైన అవసరాలను తీర్చుకోవడానికి తోడ్పడుతుందని తెలిపారు. పథర్‌కండీలో తొలి వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో లోయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంగా మారబోతుందని శ్రీ మోదీ చెప్పారు. విజయవంతమైన వ్యవసాయ అంకుర సంస్థలను ప్రారంభించడానికి స్థానిక యువతకు అవసరమైన మద్దతును ఈ సంస్థ అందిస్తుందని ప్రధానమంత్రి సూచించారు. ''బరాక్ లోయ ఇకపై వ్యవసాయ అధ్యయనాలు, పరిశోధనలకు ప్రసిద్ధి చెందుతుంది" అని తెలిపారు.

అభివృద్ధి పరుగులో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలనే మంత్రాన్ని ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తోందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ఒకప్పుడు సరిహద్దు గ్రామాలను 'చివరి' గ్రామాలుగా పరిగణించేవారని, కానీ తమ ప్రభుత్వం వాటిని దేశంలోని 'మొట్టమొదటి' గ్రామాలుగా చూస్తోందని వ్యాఖ్యానించారు. కచార్ జిల్లా నుంచి విస్తరించిన వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమం ఇప్పటికే సరిహద్దు నివాస ప్రాంతాల్లో స్పష్టమైన మార్పులను తీసుకువస్తోందని పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతాలపై ఉన్న నిర్లక్ష్యాన్ని వీడి.. ఇప్పుడు క్రియాశీలక అభివృద్ధి, వ్యూహాత్మక దృష్టితో ముందుకు వెళ్తున్నామని ప్రస్తావించారు. ''సరిహద్దు గ్రామాలను దేశంలోని మొదటి గ్రామాలుగా మేం పరిగణిస్తాం" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

వేలాది తేయాకు తోటల కుటుంబాలకు భూమి హక్కులను కల్పించడం ద్వారా అస్సాం ప్రభుత్వం ఒక చారిత్రక బాధ్యతను నెరవేర్చిందని ప్రధానమంత్రి తెలిపారు. గత రెండు శతాబ్దాలుగా సేవలందించిన తరాల భవిష్యత్తును మార్చడంలో ఈ భూమి పట్టాల పంపిణీ ఒక కీలక పరిణామంగా పేర్కొన్నారు. ఈ చట్టపరమైన భద్రత గౌరవప్రదమైన జీవితాన్ని అందిస్తుందని అన్నారు. "ఈ భూమి హక్కుల ద్వారా ఇప్పుడు ఆయా కుటుంబాలు శాశ్వత ఇళ్లు, విద్యుత్, నీటి సౌకర్యం వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందే అవకాశం కలుగుతుంది" అని ప్రధానమంత్రి తెలిపారు.

తేయాకు తోటల యువత కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, స్కాలర్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలను కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రయత్నాలు బంగారు గతంలో నిర్లక్ష్యానికి గురైన కార్మికుల పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రాంతీయ వ్యూహానికి విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం కీలకంగా మారాయని అన్నారు. ఎయిమ్స్, క్యాన్సర్ ఆసుపత్రుల వ్యవస్థతో ఆరోగ్య కేంద్రంగా అస్సాం వేగంగా ఎదుగుతోందని అన్నారు. ''తేయాకు తోటల యువతకు బంగారు భవిష్యత్తుకు బాటలు పడుతున్నాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

అస్సాం యువతకు ఇప్పుడు సెమీకండక్టర్, సాంకేతిక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని ప్రధానమంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న శాంతి, పురోగతి ఎన్నో త్యాగాల వల్ల లభించాయని, దీనిని తిరోగమన శక్తుల నుంచి కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మళ్ళీ పాత గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టడానికి ప్రయత్నించే ఏ శక్తికైనా తగిన సమాధానం ఇవ్వాలని సూచించారు. "భారతదేశపు సెమీకండక్టర్ రంగంలో అస్సాం ఇప్పుడు ఒక కీలక ప్రాంతంగా మారుతోంది. తదుపరి తరం సాంకేతికతకు సంబంధించిన వ్యవస్థ, ప్రతిభ ఇక్కడ సిద్ధమవుతోంది." అని శ్రీ మోదీ తెలిపారు.

ప్రపంచ సంక్షోభాలు, యుద్ధాల సమయంలో ప్రస్తుత ప్రభుత్వం దేశ పౌరులపై ప్రభావాన్ని తగ్గించడానికి పూర్తి శక్తితో పనిచేస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. గొప్ప భాష, సంస్కృతి మద్దతుతో పురోగతి పథంలో సాగుతున్న ఈ ప్రాంతపు ప్రయాణం ఇప్పుడు ఆపలేనిదని పేర్కొన్నారు. నేడు ప్రారంభించిన అభివృద్ధి ప్రాజెక్టులు బరాక్ లోయకు ఒక కొత్త శకానికి ప్రారంభం మాత్రమేనని ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యానించారు. ప్రజల సమష్టి సంకల్పం మొత్తం రాష్ట్రానికి ప్రకాశవంతమైన, సంపన్నమైన భవిష్యత్తును అందిస్తుందని అన్నారు. "బరాక్ లోయ కొత్త అభివృద్ధి కేంద్రంగా గుర్తింపు పొందే రోజు ఎంతో దూరంలో లేదు'' అని చెబుతూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

# డబ్ల్యూసీఎల్‌లో పలు ప్రాజెక్టులను ప్రారంభించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 16:రెండు రోజుల పర్యటన నిమిత్తం వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (డబ్ల్యూసీఎల్)ను సందర్శించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి పలు కీలక ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. శుక్రవారం రోజున డబ్ల్యూసీఎల్ పనితీరుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఎలక్ట్రిక్ వాహనాలను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. వీటితో పాటు నాగ్‌పూర్‌లోని కామ్టిలో 'బ్లాక్ డైమండ్ స్పోర్ట్స్ స్టేడియం', వాణిలోని తడలిలో 'స్వామి వివేకానంద ఎకో పార్క్', బల్లార్పూర్‌లోని సాస్తి ఓపెన్ కాస్ట్ గని వద్ద ఫస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాజెక్ట్‌కు శ్రీ కిషన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధిని, పర్యావరణ పరిరక్షణను, గనుల తవ్వకాల్లో ఆధునిక పద్ధతుల అమలును ఈ ప్రాజెక్టులు ప్రోత్సహిస్తాయి. బొగ్గు ఉత్పత్తి, భద్రత, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించి డబ్ల్యూసీఎల్ పనులను ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో డబ్ల్యూసీఎల్ పని సంస్కృతిని, విధానాలను ప్రశంసించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. బొగ్గు పరిశ్రమలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా డబ్ల్యూసీఎల్ పాత్ర గురించి వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో డబ్ల్యూసీఎల్ సాధించిన విజయాల గురించి ఆ సంస్థ సీఎండీ శ్రీ హరీశ్ దుహన్ సమావేశంలో వివరణాత్మక సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ మనోజ్ కుమార్ ఝా, కోల్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ శ్రీ బి. సాయిరాం.. బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా లిమిటెడ్, డబ్ల్యూసీఎల్ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొనసాగుతున్న గని మూసివేత ప్రక్రియను పరిశీలించేందుకు మార్చి 14, 2026న ముర్పార్ భూగర్భ గనిని కేంద్రమంత్రి సందర్శించనున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, గనుల మూసివేత సలహా కమిటీ (ఎంసీఏసీ)తో సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో డబ్ల్యూసీఎల్ మైన్ క్లోజర్ నోడల్ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీఓలు), సలహాదారులు, స్థానిక గ్రామ ప్రతినిధులు పాల్గొంటారు.

## పశ్చిమాసియాలో ఇటీవలి పరిణామాలపై వివిధ మంత్రిత్వ శాఖల వివరణ

# ఎల్పీజీ సిలిండర్ల కోసం భయాందోళనతో ముందస్తు బుకింగ్‌లు చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 16: ఇటీవలి పశ్చిమాసియా పరిణామాల వల్ల ఉత్పన్నమైన పరిస్థితిపై తాజా సమాచారాన్ని అందించడానికి ఈ రోజు జాతీయ మీడియా కేంద్రంలో నాలుగో సారి కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ మంత్రిత్వ శాఖలు (ఇంటర్ మినిస్ట్రీయల్) మీడియా సమావేశాన్ని నిర్వహించాయి. ఇటువంటి సమావేశాలను ఇంతకుముందు మార్చి 11, 12, 13 తేదీలలో కూడా నిర్వహించారు. పెట్రోలియం- సహజ వాయువు మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఓడరేవులు – నౌకాయాన – జలమార్గాల మంత్రిత్వ శాఖ, సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఇంధన సరఫరా, సముద్ర మార్గ కార్యకలాపాలు, ఆ ప్రాంతంలోని భారతీయుల సంక్షేమం, సంబంధిత కమ్యూనికేషన్ చర్యలపై తాజా వివరాలను వెల్లడించారు.

### ఇంధన సరఫరా, ఇంధన లభ్యత

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిణామాలు, హార్ముజ్ జలసంధిలోని పరిస్థితుల నేపథ్యంలో దేశంలో ఇంధన సరఫరా స్థితిగతులు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్పీజీని నిరంతరం అందుబాటులో ఉండేలా చేసిన ఏర్పాట్ల గురించి పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ అధికారి మీడియాకు వివరించారు. మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం:

### ముడిచమురు, చమురు శుద్ధి కేంద్రాలు

ప్రస్తుతం అన్ని చమురు శుద్ధి కేంద్రాలు అత్యున్నత స్థాయిలో పనిచేస్తున్నాయి. అవి తగినంత ముడిచమురు నిల్వలను కలిగి ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో మన దేశం స్వయంసమృద్ధి సాధించింది. దేశీయ అవసరాలను తీర్చేందుకు పెట్రోల్, డీజిల్‌ను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదు.

### రీటైల్ అవుట్‌లెట్లు

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నివేదికల ప్రకారం ఏ రీటైల్ అవుట్‌లెట్‌లోనూ (ఆర్ఓ) ఇంధన కొరత నమోదవ్వలేదు. పెట్రోల్, డీజిల్ తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నందున సరఫరా క్రమం తప్పకుండా జరుగుతోంది. కాబట్టి ప్రజలు భయాందోళనతో ముందస్తు కొనుగోళ్లు చేయొద్దని ప్రభుత్వం సూచిస్తోంది.

### సహజ వాయువు

ప్రాధాన్యత కలిగిన రంగాలకు సరఫరాలో ఎటువంటి కోత లేకుండా రక్షణ ఉంది. ఇందులో భాగంగా పీఎన్‌జీ, సీఎన్‌జీ సరఫరా ఎటువంటి ఆటంకం లేకుండా 100 శాతం కొనసాగుతోంది. కాబట్టి భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు సరఫరాను 80 శాతం వద్ద నియంత్రించడం జరుగుతోంది.

దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబయి, అహ్మదాబాద్, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, లక్నో, కాన్పూర్, జైపూర్ మొదలైన చోట్ల పనిచేస్తున్న సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) సంస్థలతో గెయిల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఎల్పీజీ సరఫరాపై ఒత్తిడిని తగ్గించడానికి హోటళ్లు, రెస్టారెంట్లకు కొత్త వాణిజ్య పీఎన్‌జీ కనెక్షన్‌లను వేగంగా అందించాలని, వాటిని తీసుకోవటాన్ని ప్రోత్సహించాలని ఆదేశించింది.

### ఎల్పీజీ

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎల్పీజీ సరఫరా అనేది ఇంకా ఆందోళన కలిగించే అంశంగానే ఉంది.

ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద గ్యాస్ నిల్వలు పూర్తిగా అయిపోయినదన్న నివేదిక లేదు.

భయాందోళనతో చేస్తున్న ముందస్తు కొనుగోళ్ల కారణంగా ఎల్పీజీ బుకింగ్‌ల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. సగటున రోజుకు జరిగే 55.7 లక్షల బుకింగ్‌లు నిన్నటి గణాంకాల ప్రకారం ఏకంగా 88.8 లక్షలకు పెరిగాయి.

వాణిజ్య సిలిండర్లను ప్రాధాన్యత ప్రాతిపదికన పంపిణీ చేసేందుకు వీలుగా వాటిని రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వాణిజ్య ఎల్పీజీ అందుబాటులో ఉంది.

### ప్రస్తుతం సిలిండర్ల ఆన్‌లైన్ బుకింగ్ శాతం 84 శాతంగా ఉంది.

రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సమావేశాలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటి నిత్యావసరాల సరఫరా పరిస్థితిని పర్యవేక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఉన్న పాత్ర అత్యంత కీలకమైనది.

సంబంధిత రాష్ట్రాల్లోని ఎల్పీజీ డిమాండ్, సరఫరా పరిస్థితిని సమీక్షించడానికి ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులతో హర్యానా, గోవా ముఖ్యమంత్రులు సమావేశాలు నిర్వహించారు.

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి ఎల్పీజీ నిల్వల స్థితిగతులు, సరఫరా, వినియోగదారులకు పంపిణీ చేసే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.

ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల కమిషనర్‌తో సమావేశమైన ఆయిల్ కంపెనీలు.. ఎల్పీజీ, రేషన్ కిరోసిన్ (పీడీఎస్ ఎస్‌కేఓ), వాణిజ్య ఎల్పీజీకి సంబంధించిన తాజా పరిణామాలను ఆయనకు వివరించాయి.

పరిస్థితిని పర్యవేక్షించడానికి ఇప్పటికే 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశాయి. అనేక రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్నాయి.

### అమలు చేసేందుకు తీసుకుంటున్న చర్యలు

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటి నిత్యావసరాల అక్రమ నిల్వలు, నల్లబజారు విక్రయాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఆహార – పౌర సరఫరాల శాఖ, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఉమ్మడి తనిఖీ బృందాలు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించాయి. ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు (పీఎస్‌యూ ఓఎంసీ) నిన్న ఒక్కరోజే సుమారు 1,300 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ పాయింట్ల వద్ద తనిఖీలు చేపట్టాయి.

ఉత్తరప్రదేశ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు 1,483 ప్రాంతాలను తనిఖీ చేశాయి. మొత్తం 24 ఎఫ్ఐఆర్‌లు (ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లపై 4, వ్యక్తులపై 20) నమోదయ్యాయి. ఆరుగురిని అరెస్టు చేయడంతో పాటు 19 మందిపై న్యాయమపరమైన చర్యలు ప్రారంభమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ (తిరుపతి), బీహార్, ఒడిశా, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో ఎల్పీజీ అక్రమ నిల్వలు, నల్లబజారు క్రయవిక్రయాలను తనిఖీ చేయడానికి దాడులు జరిగాయి.

### ఇతర ప్రభుత్వ చర్యలు

గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థల వంటి ప్రాధాన్యత రంగాలకు అంతరాయం లేని ఎల్పీజీ సరఫరాను అందించడమే ప్రభుత్వానికి ఉన్న అత్యున్నత ప్రాధాన్యత. చమురు శుద్ధి కేంద్రాల్లో ఎల్పీజీ ఉత్పత్తి కూడా సుమారు 31 శాతం పెరిగింది.

13.03.2026 నాటి సీఏక్యూఎం ఉత్తర్వు ప్రకారం జాతీయ రాజధాని ప్రాంతంలోని పరిశ్రమలు, హోటళ్లు, రెస్టారెంట్లు సహజ వాయువుకు బదులుగా బయోమాస్, ఆర్‌డీఎఫ్ పెల్లెట్లను ఒక నెల పాటు తాత్కాలికంగా ఉపయోగించడానికి అనుమతి ఉంది. ప్రత్యామ్నాయాలు లేని చోట బొగ్గు లేదా కిరోసిన్‌ను కూడా వాడొచ్చు. ఎల్పీజీ బుకింగ్ మధ్య ఉండే సమయాన్ని పెంచడం ద్వారా వినియోగాన్ని క్రమబద్ధీకరించారు. దీని ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల విరామం ఉండాలి. అదనంగా 48,000 కేఎల్ కిరోసిన్‌ను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించారు. హోటళ్ల రంగంలో ఎల్పీజీపై ఒత్తిడిని తగ్గించడానికి కిరోసిన్, బొగ్గును ప్రత్యామ్నాయ ఇంధనాలుగా ఉపయోగిస్తున్నారు.

డిజిటల్ పద్ధతిలో ఎల్పీజీ బుకింగ్‌లను ప్రోత్సహించటం, అనవసరమైన ముందస్తు బుకింగ్‌లను నిరుత్సాహపరచటం, గ్యాస్ ఏజెన్సీలకు అనవసరంగా వెళ్లడాన్ని నివారించాలని ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలను ఆదేశించారు.

### ప్రజా సూచనలు

ప్రజలు ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. గృహాలు, అత్యవసర విభాగాలకు ఎల్పీజీ లభ్యతను నిరంతరం కొనసాగించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

ఎల్పీజీ సిలిండర్లను ఐవీఆర్ఎస్ కాల్స్, ఎస్ఎంఎస్, వాట్సాప్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ యాప్‌ల వంటి డిజిటల్ మాధ్యమాల ద్వారా సులభంగా బుక్ చేసుకోవచ్చు. వినియోగదారులు ఇంటి నుంచే సిలిండర్లను బుక్ చేసుకోవాలని, అనవసరంగా గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లొద్దని సూచించారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద రద్దీని నివారించడానికి, ప్రజలు భయాందోళనతో ముందస్తు బుకింగ్‌లు చేయొద్దని, కేవలం డిజిటల్ పద్ధతులను మాత్రమే ఉపయోగించాలని అభ్యర్థించారు.

అందుబాటులో ఉన్న చోట వినియోగదారులు పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ఎంచుకోవచ్చు. దశాబ్దాలుగా నమ్మకమైన సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను నమ్మాలని అధికారులు కోరారు.

కేవలం సరైన సమాచారాన్ని మాత్రమే ప్రచారం చేయాలని, అధికారిక వనరులను మాత్రమే నమ్మాలని మీడియా సంస్థలను కోరారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ (ఎంఓపీఎన్‌జీ), ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీల అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయి.

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

### -అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు
### -చంద్రబాబు వైఖరిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల విమర్శలు



అమరావతి, మార్చి 16: పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం, సత్యనారాయణపురం 33వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. స్థానిక కార్పొరేటర్ మూర్తి, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, రాము, కొల్లూరు రామకృష్ణ ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం..

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. గాంధీజీ బాటలో నడిచి, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన ఆయన చరిత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. ?తెలుగు రాష్ట్రాల విభజన విషయంలో చంద్రబాబు అనుసరించిన 'రెండు కళ్ళ సిద్ధాంతాన్ని' నేతలు తీవ్రంగా విమర్శించారు.

కేవలం అధికారం కోసం ఆయన రాష్ట్రాన్ని ముక్కలు చేయడానికి సిద్ధపడ్డారని ఆరోపించారు. వివక్ష: అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయాలని చూసిన చంద్రబాబు, పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు మాత్రం సామాజిక వర్గాల నిధులను ఆశ్రయించడం ఆయన వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. నవంబర్ 1 ప్రాముఖ్యత: గత ఐదేళ్ల పాలనలో చంద్రబాబు ఎన్నడూ నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని, ఇది అమరజీవి త్యాగాన్ని అవమానించడమేనని అన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత రాజశేఖర్ రెడ్డి హయాంలోనే నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేసి గౌరవించుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో కూడా ఆయన ఆశయాలకు అనుగుణంగా, తెలుగు జాతి కీర్తిని దశదిశలా చాటేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి స్టేట్ జనరల్ సెక్రెటరీ పేరం త్రివేణి రెడ్డి, కుక్కల రమేష్, శ్రీనివాస్, మైలవరపు రాము, కొల్లూరు రామకృష్ణ, భోగాది మురళి, కోలవెన్ను రమణ, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి ఆంధ్రకే కాదు దేశానికి స్ఫూర్తిప్రదాత

### -జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్




చిత్తూరు, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా భారతదేశానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.రాజేంద్రన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోని సమీక్ష సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.రాజేంద్రన్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పి.యుగంధర్, రాష్ట్ర బెస్తా కార్పొరేషన్ డైరెక్టర్ వి.తిరుమగల్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జి.అమర్నాథ్, ఆర్యవైశ్య రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నరసింహులు శెట్టి తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అమరావతి రాజధానిలోని శాఖమూరు పార్కులో ఏర్పాటు చేసిన 58 అడుగుల ఎత్తైన అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో లైవ్ ద్వారా వర్చువల్‌గా వీక్షించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని రూ.150 కోట్ల అంచనా వ్యయంతో ఈ స్మారక ప్రాజెక్టును చేపట్టగా, 6.80 ఎకరాల విస్తీర్ణంలో మొదటి దశ పనులు పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం ఆరు నెలల్లోనే రికార్డు స్థాయిలో పనులు చేపట్టి 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది.

ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.రాజేంద్రన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్న పేరు వినగానే ముందుగా గుర్తుకొచ్చే పేరు అమరజీవి పొట్టి శ్రీరాములు గారిదేనన్నారు. పొట్టి శ్రీరాములు కేవలం ఆంధ్రకే కాకుండా దేశం మొత్తానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని, భారతదేశం గర్వించదగ్గ మహనీయుడని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్రాలను భాషా ప్రాతిపదికన ఏర్పాటు చేయాలా లేదా పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలా అనే సందిగ్ధ పరిస్థితిలో ఉన్న సమయంలో భాష ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చే బలమైన శక్తి అని ఆయన తన త్యాగంతో నిరూపించారని తెలిపారు.

భాష ద్వారా అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు అర్థమవుతాయని, పొట్టి శ్రీరాములు చేసిన మహోన్నత పోరాటం వల్లే నేడు తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, భావితరాలకు ఆయన త్యాగగాథలను తెలియజేయడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అందరికీ పొట్టి శ్రీరాములు జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ పి.యుగంధర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేయడం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఇటువంటి మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

అమరావతి రాజధానిలో పొట్టి శ్రీరాములు గారి గౌరవార్థం 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటువంటి చారిత్రక కార్యక్రమాలను చేపట్టి యువతకు ప్రేరణ కల్పిస్తున్నారని తెలిపారు. పొట్టి శ్రీరాములు ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్యవైశ్య రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నరసింహులు శెట్టి మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం రావాలని నిస్వార్థంగా పోరాడి ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఆయన త్యాగం ఫలించాలంటే సమాజం ఐక్యంగా ఉండాలని, అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం పొట్టి శ్రీరాములు జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ద్వారకనాథ్, జనరల్ సెక్రటరీ ఎం.శర్వాన్, బీజేపీ జిల్లా ఈసీ సభ్యుడు సత్య, మహేంద్ర, శ్రీనివాసమూర్తి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలన..

### -పరీక్షకు 251 మంది విద్యార్థులు గైర్హాజర్
### -జిల్లా వ్యాప్తంగా 59 పరీక్షా కేంద్రాలు తనిఖీలు..



నంద్యాల మార్చి 16: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సోమవారం నంద్యాల జిల్లాలో తెలుగు పరీక్ష ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పరీక్షలు సజావుగా నిర్వహించినట్లు రాష్ట్ర అబ్జర్వర్ ఎం.అనురాధ తెలిపారు. జిల్లాలో 130 పరీక్ష కేంద్రాలలో 24834 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 23553 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 281 మంది విద్యార్థులు గైరు హాజరైనట్లు తెలిపారు.

జిల్లాలోని రాష్ట్ర అబ్జర్వర్ తోపాటు పరీక్షల సహాయ కమిషనర్ , జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారులు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 59 పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అబ్జర్వర్ అనురాధ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు మొదటి రోజు కాస్త గందరగోళానికి గురయ్యారు అన్నారు. వారికి నంబర్లు రూములు కేటాయించడం కాస్త కన్ఫ్యూజన్ పడటంతో వారినందరికీ నర్ది చెప్పటం జరిగిందన్నారు.

విద్యార్థులకు ఏ రూంలో పరీక్ష కేంద్రం లో పరీక్ష రాయాలో నంబరు గది పరీక్ష రాసే విద్యార్థులకు చూపించి వివరాలు తెలపటం విశేషం. పరీక్షల్లో మాస్ కాఫీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామన్నారు. జిల్లాలోని 130 పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి జిరాక్స్ సెంటర్లు లేకుండా షాపులు మూసివేసామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశామన్నారు. విద్యార్థులు పరీక్షాలలో నిశ్శబ్ద వాతావరణంలో పరీక్షలు రాయటం గమనించామన్నారు.

పరీక్షాలలో విద్యార్థులకు తాగునీటి వసతి వైద్య సౌకర్యం కల్పించామన్నారు. పరీక్షా కేంద్రాలలో డిపార్ట్మెంటల్ అధికారి తో పాటు, చీఫ్ సూపర్డెంట్, ప్రతి ఇన్విజిలేటర్, 70 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సిట్టింగ్ స్క్వాడ్ ఎవరి విధులు వారు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి ఏ ఇన్విజిలేటర్లు సెల్ఫోన్ తీసుకువెళ్ల కూడదన్నారు. ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి తెచ్చిన తర్వాత రాష్ట్రం నుంచి ఏర్పాటు చేసిన మీటింగ్ లో చెప్పిన పేపర్ కోడ్ ను మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు. తెలుగు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 98.87 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు.ప్రతి పరీక్ష కు ప్రభుత్వము సెలవు రోజులు ఉన్నాయని ఆ సెలవు రోజుల్లో ఏడాది పాటు కష్టపడి చదివిన విద్యార్థి రివిజన్ చేసుకుని మంచి మార్కులు సాధించాలని రాష్ట్ర అబ్జర్వర్ అనురాధ ఆశించారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి విజయాన్ని సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఉపవిద్యాశాఖ అధికారులు పరిశీలించారు.

# ఇంటిపై కోడీ గుడ్లు, టమోటాలతో దాడి

అమరావతి, మార్చి 16:హిందువులను కించపరిచే విధంగా అనుచిత వాఖ్యలు చేసిన తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు వాఖ్యలను ఖండిస్తూ బోడుప్పల్ లోని మందుల సామేలు బీజేపీ, బీజెవై ఎం నాయకులు ఇల్లు ముట్టడించారు. ఈ సందర్భంగా కోడిగుడ్లు, టమాటాలతో వారు ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సామేలు 24 గంటల్లో హిందువులకు క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు.

తుంగతుర్తి నియోజకవర్గంలో ఎలక్షన్ సమయంలో ఆలయాల వద్దకు వచ్చి దండాలు పెట్టి నన్ను గెలిపించండి అని, ఈరోజు హిందువులను కించపరిచే విధంగా మాట్లాడటం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. బేషరతుగా వెంటనే క్షమాపణ చెప్పాలని లేనియెడల ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సందర్భంగా మేడిపల్లి పోలీసులు బీజేపీ, బీజేవైఎం నాయకులను అడ్డగించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్న కేంద్రం : పోలేపల్లి ఉదయ్‌కుమార్

నల్గొండ, మార్చి 16: కేంద్ర ప్రభుత్వం గత 13 సంవత్సరాల నుండి పెట్టుబడి వర్గాన్ని పెంచి పోషిస్తుందని, నిరంతరం ప్రజలపై అధిక ధరల భారాన్ని మోపుతుందని సిపిఐ దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు దామరచర్ల మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్, నిత్యవసరాల ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసి, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, ఎప్పటికప్పుడు ధరలను పెంచుకుంటూ పోతూ సామాన్యుడి నడ్డి విరుస్తుందని దుయ్యబట్టారు. ఇకనైనా ధరలను నియంత్రించకపోతే పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి దేశవ్యాప్త ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి ధనావత్ శాంత, సీనియర్ నాయకులు జమ్ముల కోటయ్య, గజ్జల లక్ష్మీనరసింహారెడ్డి, భాగం శేషయ్య, శుద్ధబోయిన రాములు, వెంకన్న, వినయ్, యశ్వంత్, రమేశ్, నరసింహ, సాంబ, శివాజీ, రాజు పాల్గొన్నారు.

# పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభం..

## -చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు జరుగుతున్న ప్రాజెక్టు
## -ఏప్రిల్ నెల నుండి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్ట్



చిత్తూరు, మార్చి 16: ఆధునిక సాంకేతికతను వినియోగించి ప్రతి పౌరుడికి సమగ్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్ట్ రాష్ట్ర ఆరోగ్య రంగంలో ఒక డిజిటల్ విప్లవంగా రూపుదిద్దుకుంటోంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ డేటా నిర్వహణ, టెలి మెడిసిన్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా, ఖచ్చితమైన వైద్య సేవలు అందించేందుకు ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారుతోంది.

చిత్తూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 జూలై 3న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. తొలుత కుప్పం ప్రాంతంలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ కార్యక్రమం ప్రజల నుంచి విశేష స్పందన పొందడంతో జిల్లాలోని ఇతర ప్రాంతాలకు విస్తరించబడింది.

ఆరోగ్య సేవల అందుబాటును పెంచడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం, ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం వంటి ముఖ్య లక్ష్యాలతో ఈ ప్రాజెక్ట్ అమలవుతోంది. సంజీవని ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రతి పౌరుడికి ప్రత్యేకమైన డిజిటల్ హెల్త్ ఐడి సృష్టించబడుతుంది. ఈ హెల్త్ ఐడితో వ్యక్తి ఆరోగ్య చరిత్ర మొత్తం ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉంటుంది. గతంలో వచ్చిన వ్యాధులు, వాడిన మందులు, పరీక్షల రిపోర్టులు, చికిత్స వివరాలు అన్నీ ఒకే చోట భద్రపరచబడతాయి.

రోగి ఏ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా పాత రికార్డులు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా డాక్టర్లు కేవలం ఆ ఐడి ద్వారా పూర్తి ఆరోగ్య వివరాలను పరిశీలించి చికిత్స అందించగలరు. దీనివల్ల చికిత్సలో ఖచ్చితత్వం పెరగడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రోగుల ఆరోగ్య వివరాలను విశ్లేషించి వ్యాధుల ప్రారంభ దశలోనే గుర్తించే విధంగా సాంకేతిక వ్యవస్థను రూపొందించారు. దీంతో మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, రక్తహీనత వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సలహాలు అందించవచ్చు.

ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యే ముందు నివారణ చర్యలు చేపట్టడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యంగా ఉంది. సంజీవని ప్రాజెక్ట్ అమలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక, ఆర్థిక సహకారం కూడా ఈ ప్రాజెక్టుకు లభిస్తోంది. ముఖ్యంగా బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి ప్రముఖ సంస్థలు ఈ కార్యక్రమానికి మద్దతు అందిస్తున్నాయి. కుప్పం ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల కార్యకలాపాలను సమన్వయం చేస్తూ ప్రధాన నియంత్రణ కేంద్రంగా పనిచేస్తోంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు అనేక రకాల ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, రక్తహీనత వంటి సమస్యలతో పాటు మొత్తం 42 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి వ్యక్తికి ఒక ప్రత్యేక "హెల్త్ స్కోర్" ఇవ్వబడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కూడా వీడియో కాల్ ద్వారా నిపుణులైన వైద్యుల సలహాలు అందే విధంగా టెలి మెడిసిన్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

అవసరమైతే మొబైల్ యాప్ లేదా డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ముందుగానే డాక్టర్ అపాయింట్‌మెంట్ బుక్ చేసుకునే సౌకర్యం కల్పించారు. మరింత మెరుగైన చికిత్స అవసరమైన సందర్భాల్లో పెద్ద ఆసుపత్రులకు రిఫరల్ సదుపాయం కూడా ఈ ప్రాజెక్ట్ ద్వారా అందిస్తున్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైనప్పుడు జిల్లా లేదా రాష్ట్ర స్థాయి వైద్య కేంద్రాలకు సిఫార్సు చేసి, తర్వాత ఫాలోఅప్ సేవలను కూడా అందిస్తున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కూడా నాణ్యమైన వైద్య సేవలు సులభం గా అందుతున్నాయి.

### సుమారు 3.20 లక్షల మందికి డిజిటల్ హెల్త్ కార్డులు జారీ

కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 3.20 లక్షల మందికి డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయడం ద్వారా ఈ ప్రాజెక్ట్ విజయవంతమైంది. ఈ అనుభవంతో ఇప్పుడు చిత్తూరు జిల్లాలోని మిగిలిన సుమారు 17 లక్షల మంది ప్రజలకు కూడా ఈ సేవలు అందించేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా సంజీవని డెస్కులు ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో వి-పాడ్స్ అనే ఆటోమేటిక్ హెల్త్ చెకప్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఈ యంత్రాల ద్వారా కొన్ని నిమిషాల్లోనే ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయవచ్చు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది రోగుల వివరాలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేయడానికి హెల్త్ ఎక్స్ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నారు. ప్రజలు ఈ ప్రాజెక్ట్‌లో నమోదు కావడానికి గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో ఉన్న ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా తమ ఆధార్ వివరాలు ఇచ్చి డిజిటల్ హెల్త్ ఐడిని సృష్టించుకోవచ్చు. అలాగే మొబైల్ యాప్ ద్వారా స్వయంగా కూడా నమోదు చేసుకునే సౌకర్యం ఉంది. ప్రస్తుతం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలను సేకరించి ప్రజలను ఈ ప్రాజెక్ట్‌లో చేర్చుతున్నారు.

ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మరింత విస్తరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఏప్రిల్ నెల నుండి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేయాలని ప్రణాళిక రూపొందించింది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ ప్రాజెక్ట్ పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు చేపడుతున్నారు. సాంకేతికతను వినియోగించి ప్రతి పౌరుడికి సమగ్ర ఆరోగ్య భద్రత కల్పించాలనే లక్ష్యంతో అమలవుతున్న సంజీవని ప్రాజెక్ట్, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చే కీలక కార్యక్రమంగా మారనుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పరిశ్రమల పోటీతత్వాన్ని పెంపొందించడానికి, స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయడానికి విద్యుత్ నిబంధనలను సవరించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 16:భారత ప్రభుత్వం విద్యుత్ (సవరణ) నిబంధనలు- 2026ను నోటిఫై చేసింది. దీని ద్వారా స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల (క్యాప్టివ్ పవర్ జనరేటింగ్ ప్లాంట్ల - సీజీపీ)కు సంబంధించిన 2005 నాటి విద్యుత్ నిబంధనలలోని రూల్ 3ని సవరించింది. వివరణాత్మక అస్పష్టతలను తొలగించడం, పరిశ్రమలకు వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం, స్వీయ వినియోగ విద్యుత్ వ్యవస్థను భారత దేశ ఇంధన మార్పు, పారిశ్రామిక వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మార్చడం ఈ సవరణల ప్రధాన ఉద్దేశ్యం.

2003 నాటి విద్యుత్ చట్టం ప్రకారం స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి ఒక కీలకమైన వెసులుబాటు. పరిశ్రమలకు నమ్మకమైన, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ సరఫరాను అందించడంలో స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి ఒక ముఖ్యమైన యంత్రాంగమని 2005 నాటి జాతీయ విద్యుత్ విధానం గుర్తించింది. విద్యుత్ సరఫరాలో అడ్డంకులను అధిగమించడానికి, విద్యుత్ ధరల హెచ్చుతగ్గులను సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ విధానం పరిశ్రమలకు తోడ్పడుతూ, పారిశ్రామిక వృద్ధికి వెన్నుదన్నుగా నిలిచింది.

సుస్థిర లక్ష్యాలను చేరుకోవడానికి, ఖర్చులను తగ్గించుకోవడానికి భారతీయ పరిశ్రమలు శిలాజ ఇంధనేతర ఇంధన వనరుల వైపు వేగంగా మొగ్గు చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో, పారిశ్రామిక పోటీతత్వాన్ని పెంపొందించడానికి, భారత దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడానికి స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి కోసం స్పష్టమైన, అంచనా వేయదగిన, అమలు చేయగల వ్యవస్థను రూపొందించడం చాలా కీలకం.

వినియోగ కేంద్రానికి వీలైనంత దగ్గరగా విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం వల్ల ప్రసార నష్టాలు తగ్గుతాయి. వ్యవస్థ సామర్థ్యం పెరుగుతుంది. గ్రిడ్ పటుత్వం బలపడుతుంది. అందువల్ల, ఈ సవరణలు నిర్వహణ, యాజమాన్యం, వినియోగానికి సంబంధించిన చట్టబద్ధమైన రక్షణలను కొనసాగిస్తూనే, స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి నిబంధనల అమలులో స్పష్టతను అందిస్తాయి.

విద్యుత్ (సవరణ) నిబంధనలు-2026ను ప్రవేశపెట్టడం ద్వారా స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నియంత్రణ వ్యవస్థలో మరింత స్పష్టత, సౌలభ్యాన్ని కల్పించారు. దీనివల్ల పరిశ్రమలు సొంత అవసరాల కోసం విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవడం మరింత సులభతరం అవుతుంది. ఆధునిక కార్పొరేట్ నిర్మాణాలు, మారుతున్న పారిశ్రామిక ఇంధన అవసరాలకు అనుగుణంగా స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి విధానాన్ని మార్చడానికి ఈ సవరణలను ఉద్దేశించారు. ముఖ్యంగా, కంపెనీలు శిలాజ ఇంధనేతర ఆధారిత స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులలో పెట్టుబడులు పెంచుతున్న తరుణంలో ఇవి చాలా కీలకం. యాజమాన్య నిబంధనలను స్పష్టం చేయడం, గ్రూప్ క్యాప్టివ్ ఏర్పాట్ల కోసం నియమాలను సరళీకరించడం, స్పష్టమైన ధృవీకరణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, నియంత్రణ పరమైన అస్పష్టతలను వివాదాలను తగ్గించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యం. నిబంధనల్లోని అనేక అంశాల అమలును సులభతరం చేసేలా సరళీకరించారు. ముఖ్యంగా, క్యాప్టివ్ హోదా ధ్రువీకరణ పెండింగ్‌లో ఉన్న సమయంలో పంపిణీ సంస్థలు వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించకుండా ఉండేలా ఒక కొత్త నిబంధనను చేర్చారు. మొత్తంమీద, ఈ సవరణలు వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందిస్తాయని, స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి ద్వారా పరిశ్రమలు నమ్మకంగా, తక్కువ ధరకే విద్యుత్తును పొందేలా చేస్తాయని భావిస్తున్నారు. ఇవి నియంత్రణ పరమైన అస్పష్టతలను, వివాదాలను తగ్గించడమే కాకుండా, క్యాప్టివ్, శిలాజ ఇంధనేతర ఇంధన ప్రాజెక్టులలో మరిన్ని పెట్టుబడులను ప్రోత్సహించే అవకాశం ఉంది.

### యాజమాన్య నిబంధనల స్పష్టమైన నిర్వచనం

స్వీయ వినియోగ విద్యుత్ ప్లాంట్‌ను స్థాపించే సంస్థకు చెందిన అనుబంధ సంస్థలు, హోల్డింగ్ కంపెనీలు, ఆ హోల్డింగ్ కంపెనీకి చెందిన ఇతర అనుబంధ సంస్థలను కూడా యాజమాన్య పరిధిలోకి చేరుస్తూ నిబంధనలను స్పష్టం చేశారు. విద్యుత్ ఆస్తులను తరచుగా గ్రూప్ సంస్థలు లేదా స్పెషల్ పర్పస్ వెహికల్స్ ద్వారా అభివృద్ధి చేసే ఆధునిక కార్పొరేట్ నిర్మాణాలను ఈ సవరణ గుర్తిస్తుంది. కేవలం సంస్థాగత నిర్మాణం కారణంగా కార్పొరేట్ గ్రూపులు చేసే చట్టబద్ధమైన క్యాప్టివ్ పెట్టుబడులకు 'క్యాప్టివ్ హోదా' నిరాకరించకుండా ఈ సవరణ భరోసా ఇస్తుంది.

### ఏకరీతి ధ్రువీకరణ కాలం

క్యాప్టివ్ హోదా ధృవీకరణను ఇకపై మొత్తం ఆర్థిక సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. దీనివల్ల నిబంధనల అమలులో స్పష్టత, ఏకరూపత వస్తుంది. ఒకవేళ క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను ఒక ఆర్థిక సంవత్సరం మధ్యలో కొనుగోలు చేసినా లేదా యాజమాన్యం ముగిసినా (మొదటి లేదా చివరి సంవత్సరం), ఆ ఆర్థిక సంవత్సరంలో ప్లాంట్ యాజమాన్యంలో ఉన్న సంబంధిత కాలానికి మాత్రమే ధ్రువీకరణ చేస్తారు.

వ్యక్తుల సంఘం ద్వారా ఏర్పాటు చేసే స్వీయ వినియోగ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు

వ్యక్తుల సంఘం (అసోసియేషన్ ఆఫ్ పర్సన్స్) ద్వారా ఏర్పాటు చేసిన గ్రూప్ క్యాప్టివ్ ప్రాజెక్టుల నిర్వహణలో ఈ సవరణలు మరింత సౌలభ్యాన్ని కల్పిస్తాయి. చట్టబద్ధమైన యాజమాన్యం, వినియోగ నిబంధనలకు లోబడి, క్యాప్టివ్ వినియోగదారులు తమ కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా విద్యుత్తును వాడుకునే వెసులుబాటు ఉంటుంది.

వ్యక్తుల సంఘం కింద ఉన్న వ్యక్తిగత వినియోగదారులు తమకు కేటాయించిన నిష్పత్తి కంటే ఎక్కువ విద్యుత్తును వినియోగించినప్పటికీ, అది ప్లాంట్ క్యాప్టివ్ హోదా రద్దుకు దారితీయదు. అటువంటి అదనపు వినియోగాన్ని ఆ వ్యక్తిగత సభ్యుని 'క్యాప్టివ్ వినియోగం'గా పరిగణించరు. కానీ దానిని గ్రూప్ మొత్తం పాటించాల్సిన కనీస 51% ఉమ్మడి వినియోగ నిబంధన కింద లెక్కిస్తారు.

ఒకవేళ వ్యక్తుల సంఘంలోని ఏ సభ్యుడైనా 26 శాతం లేదా అంతకంటే ఎక్కువ యాజమాన్య వాటాను కలిగి ఉంటే, ఆ నిర్దిష్ట సంస్థకు 'నిష్పత్తి ప్రకారం వినియోగం' అనే నిబంధన వర్తించదు. ఆ సభ్యుడు వినియోగించే మొత్తం విద్యుత్తును 'క్యాప్టివ్ వినియోగం'గానే పరిగణిస్తారు.

నిష్పత్తి ప్రకారం వినియోగ లెక్కల కోసం, ఒక క్యాప్టివ్ వినియోగదారునితో పాటు ఆ సంస్థ అనుబంధ విభాగాలు, హోల్డింగ్ కంపెనీ, ఆ హోల్డింగ్ కంపెనీకి చెందిన ఇతర అనుబంధ సంస్థలను కలిపి ఒకే వ్యక్తిగా పరిగణిస్తారు.

### క్యాప్టివ్ హోదా ధ్రువీకరణ కోసం నోడల్ ఏజెన్సీలు

2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా, రాష్ట్రంలోనే వినియోగించే క్యాప్టివ్ విద్యుత్ (ఇంట్రా-స్టేట్ క్యాప్టివ్ వినియోగం) సందర్భాల్లో క్యాప్టివ్ హోదా ధృవీకరణ కోసం రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలు ఒక నోడల్ ఏజెన్సీని నియమించవచ్చు. రాష్ట్రాల మధ్య వినియోగించే క్యాప్టివ్ విద్యుత్ (ఇంటర్-స్టేట్ క్యాప్టివ్ వినియోగం) సందర్భాల్లో ధ్రువీకరణను నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్డీసీ) నిర్వహిస్తుంది.

క్యాప్టివ్ హోదా ధ్రువీకరణ నిర్ణయాల వల్ల తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి సంబంధిత ప్రభుత్వం (కేంద్రం లేదా రాష్ట్రం) ఒక ఫిర్యాదుల పరిష్కార కమిటీని ఏర్పాటు చేస్తుంది.

క్రాస్-సబ్సిడీ సర్చార్జి, అదనపు సర్చార్జ్‌ల నిర్వహణ

క్యాప్టివ్ హోదా ధృవీకరణ పెండింగ్‌లో ఉన్న సమయంలో, వినియోగదారులు నిర్దేశించిన డిక్లరేషన్‌ను సమర్పిస్తే వారికి క్రాస్-సబ్సిడీ సర్చార్జ్ (సీఎస్ఎస్) అదనపు సర్చార్జ్ (ఏఎస్) విధించరు. ఇందుకోసం అంతర్-రాష్ట్ర కేసుల్లో ఎన్ఎల్డీసీ జారీ చేసిన విధానాలను, రాష్ట్రాల కేసుల్లో రాష్ట్ర నోడల్ ఏజెన్సీ జారీ చేసిన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

ఒకవేళ ధ్రువీకరణ ప్రక్రియ ముగిసిన తర్వాత, సదరు ప్లాంట్ క్యాప్టివ్ పవర్ ప్లాంట్ హోదాను పొందేందుకు విఫలమైతే, అప్పటివరకు మినహాయించిన క్రాస్-సబ్సిడీ సర్చార్జ్, అదనపు సర్చార్జ్ మొత్తాలను క్యారీయింగ్ కాస్ట్ లేదా వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్యారీయింగ్ కాస్ట్‌ను విద్యుత్ (లేట్ పేమెంట్ సర్చార్జ్, సంబంధిత అంశాలు) నిబంధనలు - 2022 ప్రకారం నిర్దేశించిన లేట్ పేమెంట్ సర్చార్జ్ ప్రాథమిక రేటు ఆధారంగా లెక్కిస్తారు.

### సవరణల అమలు

సమర్థవంతమైన అమలు కోసం, వ్యక్తుల సంఘాల నిర్మాణాలలో నిష్పత్తి ప్రకారం విద్యుత్ వినియోగం, ధృవీకరణ యంత్రాంగం, సీఎస్ఎస్, ఏఎస్ నిర్వహణకు చ సంబంధించిన కొన్ని నిబంధనలు ఏప్రిల్ 1, 2026 నుంచి అమలులోకి వస్తాయి. ఇతర సవరణలు తక్షణమే అమలులోకి వస్తాయి.

### పారిశ్రామిక వృద్ధి, స్వచ్ఛ ఇంధన మార్పిడికి మద్దతుగా సంస్కరణలు

పరిశ్రమలకు క్యాప్టివ్ జనరేషన్ ద్వారా నమ్మకమైన, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్తును అందుబాటులోకి తీసుకురావడం ద్వారా, ఈ సంస్కరణలు పారిశ్రామిక పోటీతత్వాన్ని బలోపేతం చేస్తాయి.

సుస్థిరమైన భారత్ ఇంధన భవిష్యత్తు వైపు మారేందుకు మద్దతునిస్తాయి. ఈ సంస్కరణలు ఇంధన స్వయం సమృద్ధికి సంబంధించిన ప్రభుత్వ విస్తృత దృక్పథానికి అనుగుణంగా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి దోహదపడతాయి.

# ఢిల్లీ, కోల్‌కతాల్లో వ్యవస్థీకృత బంగారం అక్రమ రవాణా, ద్రవీకరణ ముఠాపై ఉక్కుపాదం మోపిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, మార్చి 16:విదేశాల నుంచి బంగారాన్ని భారత్‌లోకి అక్రమంగా రవాణా చేయడం... రైలు మార్గం ద్వారా వివిధ ప్రాంతాలకు దానిని తరలించడం... అక్రమంగా వివిధ కేంద్రాల వద్ద దానిని కరిగించడం... ఆకృతిని మార్చడం... దేశీయ మార్కెట్లో రహస్యంగా విక్రయించడం వంటి నేరాలకు పాల్పడుతున్న ఒక వ్యవస్థీకృత ముఠా మోసాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) బయట పెట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా మొత్తం రూ. 14.13 కోట్ల విలువైన బంగారం, వెండి, భారతీయ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ముఠాకు చెందిన ఆరుగురు వ్యక్తులనూ అరెస్టు చేశారు.

కస్టమ్స్ చట్టం, 1962లోని నిబంధనల ప్రకారం రూ. 13.41 కోట్ల విలువైన 8286.81 గ్రాముల బంగారం, రూ. 19.67 లక్షల విలువైన 7350.4 గ్రాముల వెండి, రూ. 51,74,100 విలువైన భారతీయ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

నిఘా వర్గాల నుంచి అందిన నిర్దిష్ట సమాచారం మేరకు, కోల్‌కతా నుంచి రైలులో వచ్చిన ఒక ప్రయాణికుడు స్టేషన్ వెలుపల ఉన్న వ్యక్తికి అందించడానికి ఉద్దేశించిన విదేశీ బంగారాన్ని డీఆర్ఐ అధికారులు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్నారు. బంగారం రవాణా చేస్తున్న వ్యక్తినీ, తీసుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తినీ అదుపులోకి తీసుకున్నారు.

వెల్లడైన వివరాల ఆధారంగా ఢిల్లీలో తదుపరి సోదాలు నిర్వహించగా, నగరంలో అక్రమంగా బంగారం కరిగించే ఒక కేంద్రంలో విదేశీ బంగారాన్ని కరిగించి దాని గుర్తుల్ని మార్చడం, స్థానిక బంగారం మార్కెట్లో విక్రయించడం కోసం ఇవన్నీ చేస్తున్నట్లు గుర్తించారు. ఆ ప్రాంగణం నుంచీ అక్రమంగా నిల్వ చేసిన బంగారం, వెండి, భారతీయ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత కేంద్రాన్ని నిర్వహిస్తున్న మేనేజర్‌నూ అరెస్టు చేశారు.

తదుపరి దర్యాప్తు కోల్‌కతాలో చేపట్టిన అధికారులు... అక్కడ అక్రమ ముఠా సూత్రధారి వద్ద ఆకృతి మార్చిన బంగారంతో పాటు మరో బంగారాన్ని కరిగించే కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. అతనితో పాటు ఇద్దరినీ అరెస్టు చేశారు. భారత్‌లోకి అక్రమంగా రవాణా చేసిన విదేశీ ముద్రలున్న బంగారాన్ని స్వీకరించామని, గుర్తింపు సాధ్యపడే గుర్తులను తొలగించడానికి దానిని కరిగించామని, తదుపరి పంపిణీ కోసం రైలు మార్గం ద్వారా దానిని ఢిల్లీకి రవాణా చేయాల్సి ఉందని విచారణలో నిందితులు అంగీకరించారు.

బంగారం అక్రమ రవాణా, వివిధ ప్రాంతాలకు అక్రమ తరలింపు, కరిగించడం, విక్రయ చేయడంతో సంబంధం ఉన్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, సంబంధిత కోర్టులో హాజరుపరిచారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# పారిశుధ్య కార్మికుల సేవలకు సలాం..

నల్గొండ, మార్చి 16:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాల అభివృద్ధి కొరకు తీసుకొచ్చిన ప్రజా పాలన-ప్రజా ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు అందించే సేవలు వెలకట్టలేనివని, వారు అంకితభావంతో పనిచేస్తేనే గ్రామాలు ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉంటాయని చేంగల్ సర్పంచ్ దుమాల మమత (రాజు)అన్నారు. సోమవారం మండలంలోని చేంగల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' లో భాగంగా 99 రోజుల కార్యాచరణను పురస్కరించుకుని 11వ రోజు పారిశుధ్య కార్మికులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ఎండనక, వాననక గ్రామాన్ని శుభ్రం చేసే కార్మికుల శ్రమను గుర్తించి, వారిని గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

గ్రామంలో పరిశుభ్రత వెల్లివిరియడం వల్ల వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని, ప్రజల ఆరోగ్యంలో కార్మికుల పాత్ర కీలకమని కొనియాడారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ అభివృద్ధికి,పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాతి మోహన్ గౌడ్,వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుతను చంపిన కేసులో నిందితులకు రిమాండ్..




దండేపల్లి, మార్చి 16: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోని దండేపల్లి మండలం తాళ్లపేట రేంజ్ పరిధిలోని ఊట్ల అటవీ ప్రాంతంలో ఇటీవల వేటగాళ్ల ఉచ్చుకి బలైన చిరుతపులి కేసులో ముగ్గురు నిందితులను అటవీశాఖ అధికారులు రిమాండ్ చేశారు. చిరుతను వాహన బైక్ క్లచ్ వైర్లతో ఉచ్చు వేసి చంపి గోర్లతో పాటు ఇతర అవయవాలు తీసుకున్న ఘటనలో ముగ్గురు నిందితులను రిమాండ్ కు తరలించినట్లు తాళ్లపేట రేంజ్ ఆఫీసర్ సుస్మారావు తెలిపారు .

నిందితులు దండేపల్లి మండలంలోని పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన మోడితే వెంకటేష్, మోడితే శ్రీనివాస్, వనపర్తి శ్రీకాంత్ లను సోమవారం లక్షెటిపేట కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ వన్యప్రాణులకు హాని కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పోచమల్లు, బీట్ ఆఫీసర్లు నహేరా, సాయికుమార్,కృష్ణ తదితరులు ఉన్నారు.

# పెండింగ్ మెస్ చార్జీలన్నింటినీ వెంటనే విడుదల చేయాలి : జాజుల లింగం గౌడ్

నల్లగొండ, మార్చి 16 : పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలన్నింటినీ విడుదల చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా విడుదల చేయాల్సినటువంటి మెస్ చార్జీలను ఎనిమిది నెలలకు ఒకసారి విడుదల చేయడం చాలా బాధాకరమన్నారు. బీసీ వసతి గృహ సంక్షేమ అధికారులు అప్పులు చేసి మరీ హాస్టల్స్‌ను నడపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పేరుతో వేల కోట్లు ఖర్చు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను వదిలిపెట్టి గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ ఎందుకు పెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టేకోలు దీపేందర్, శివ, మహేశ్ యాదవ్, అనిల్, విక్రం, రాజు, సునీల్ కుమార్, క్రాంతి పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా నౌకాశ్రయాల్లో నౌకల కదలికలు, సరకు రవాణా కార్యకలాపాలపై కొనసాగుతున్న నిఘా

న్యూఢిల్లీ, మార్చి 16:పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సన్నద్ధత, సహాయక చర్యలకు సంబంధించి భారత ప్రభుత్వం చేపట్టిన కార్యకలాపాల వివరాలను ఇచ్చారు. ఇవి ఇంధన సరఫరా నిర్వహణ, సముద్రయాన కార్యకలాపాలు, ఆ ప్రాంతంలోని భారతీయ పౌరుల సంక్షేమం, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించే చర్యలకు సంబంధించినవి.

ఇంధన సరఫరా, ఇంధన లభ్యత

దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్పీజీ నిరంతరం అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. వీటి సరఫరా, పంపిణీ క్రమబద్ధంగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రస్తుత పరిస్థితి ఈ విధంగా ఉంది:

ముడి చమురు, రిఫైనరీలు

అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయి. వాటివద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో మన దేశం స్వయం సమృద్ధిని సాధించింది. దేశీయ అవసరాల కోసం పెట్రోల్, డీజిల్‌ను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదు.

రిటైల్ విక్రయ కేంద్రాలు

చమురు విక్రయ సంస్థల రిటైల్ అవుట్ లెట్స్‌లో ఇంధనం అయిపోయినట్లు నివేదికలు లేవు. పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నందున ప్రజలు ఆందోళనతో ముందస్తు కొనుగోళ్లు చేయవద్దని సూచించారు.

### సహజవాయువు

ప్రాధాన్యత రంగాలకు గ్యాస్ సరఫరా నిరంతరంగా కొనసాగుతోంది. పీఎన్‌జీ, సీఎన్‌జీ విభాగాలకు 100% సరఫరా కొనసాగుతుండగా.. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు 80% సరఫరా జరుగుతోంది.

ప్రధాన నగరాలు, పట్టణాల్లోని వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులు ఇకపై పీఎన్‌జీ కనెక్షన్లను ఎంచుకోవాల్సిందిగా ప్రోత్సహిస్తూ.. ఆసక్తి గల వినియోగదారులు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) కంపెనీలకు ఈమెయిల్, లేఖ ద్వారా లేదా కస్టమర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు.. పీఎన్‌జీఆర్‌బీ, సీజీడీ సంస్థలతో కలిసి మార్చి 14, 2026న నిర్వహించిన సమావేశంలో పీఎన్‌జీ కనెక్షన్లు, ఎల్పీజీ-టు-పీఎన్‌జీ మార్పులపై సమీక్షించారు.

### ఎల్పీజీ

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఎల్పీజీ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది.

ఎల్పీజీ పంపిణీ కేంద్రాల వద్ద గ్యాస్ నిల్వలు లేవని నివేదికలు అందలేదు.

ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ గణనీయంగా తగ్గాయి. మార్చి 13, 2026న 88.8 లక్షల బుకింగ్స్ అవగా, నిన్న ఆ సంఖ్య సుమారు 77 లక్షలకు పడిపోయింది.

### ఆన్‌లైన్ ద్వారా జరిగే బుకింగ్స్ శాతం 84% నుంచి సుమారు 87%కి పెరిగింది.

బీహార్, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్ వంటి పలు రాష్ట్రాలు, యూటీలు గృహేతర ఎల్పీజీ కేటాయింపులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేశాయి.

వాణిజ్య అవసరాలకు ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్లను ప్రాధాన్యత ప్రాతిపదికన పంపిణీ చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించారు. ప్రస్తుతం ఇవి 30 రాష్ట్రాలు, యూటీల్లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి.

### రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన సమావేశాలు

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటి నిత్యావసర వస్తువుల సరఫరాను పర్యవేక్షించటంలో రాష్ట్ర ప్రభుత్వాలు, యూటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఎల్పీజీ సరఫరా పర్యవేక్షణకు, పంపిణీలో అంతరాయం కలగకుండా చూసేందుకు, బ్లాక్ మార్కెటింగ్, ముందస్తు బుకింగ్స్ అరికట్టేందుకు పలు రాష్ట్రాలు, యూటీల్లో ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయి.

పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించటానికి 22 రాష్ట్రాలు, యూటీలు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశాయి. పౌరులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పలు రాష్ట్రాలు మీడియా సమావేశాలను నిర్వహిస్తున్నాయి.

### అమలు చర్యలు

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి.

ఎల్పీజీ సిలిండర్ల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్, బీహార్ సహా పలు రాష్ట్రాల్లో అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు.

గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు, అక్రమాలను అరికట్టేందుకు ఎల్పీజీ సరఫరాదారుల వద్ద పీఎస్‌యూ ఆయిల్ మార్కెట్ కంపెనీలు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాయి.

### ప్రభుత్వ చర్యలు

దేశీయ వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా ఇళ్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థల వంటి ముఖ్యమైన విభాగాలకు ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.

రిఫైనరీల నుంచి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచారు. సరఫరా, డిమాండ్‌కు సంబంధించి పలు చర్యలు తీసుకున్నారు.

మార్చి 14, 2026న జారీ చేసిన ఎల్పీజీ నియంత్రణ ఉత్తర్వుల సవరణ ప్రకారం.. పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వినియోగదారులు దేశీయ ఎల్పీజీ కనెక్షన్లను తప్పనిసరిగా వదులుకోవాలి. పీఎన్‌జీ కనెక్షన్ ఉన్నవారికి నూతన ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వకూడదు.

అందరికీ సమానంగా పంపిణీ చేసేందుకు బుకింగ్ కాలపరిమితిని పట్టణాల్లో 25 రోజులకు, గ్రామాల్లో 45 రోజులకు మార్చారు.

ప్రత్యామ్నాయ ఇంధన అవసరాలకు రాష్ట్రాలు, యూటీల్లో అదనంగా 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేటాయించారు.

ఎల్పీజీ సరఫరా వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు హోటళ్లు, రెస్టారెంట్లు వంటి కొన్ని రంగాల్లో కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని అందుబాటులోకి తెచ్చారు.

సరఫరా సజావుగా సాగేందుకు పీఎస్‌యూ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు.. డిజిటల్ బుకింగ్స్‌ను ప్రోత్సహిస్తున్నాయి. వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయవద్దని సూచించారు. అంతేకాక, ఆదివారాల్లోనూ గ్యాస్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయి.

బహిరంగ ప్రకటన

గృహ అవసరాలకు, ఇతర ముఖ్య రంగాలకు అవసరమైన ఎల్పీజీ నిరంతరం అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పౌరులెవరూ ఆందోళన చెందవద్దని అధికారులు సూచించారు.

ఐవీఆర్ఎస్ కాల్స్, ఎస్ఎంఎస్, వాట్సాప్, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ యాప్స్ వంటి పలు రకాల డిజిటల్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లను బుక్ చేసుకోవచ్చు.

ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయకూడదని, డిజిటల్ వేదికలను వినియోగించుకోవాలని, గ్యాస్ సరఫరా కార్యాలయాలకు అనవసరంగా వెళ్లవద్దని కోరారు.

సాధ్యమైన ప్రాంతాల్లో పౌరులు పీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ఎంచుకోవాలని ప్రోత్సహిస్తున్నారు.

ఎల్పీజీ సరఫరా నిరంతరాయంగా జరుగుతుందని, ఆందోళనతో అనవసరంగా చేసే బుకింగ్స్ ఇటీవల తగ్గినట్లు ప్రభుత్వం, పీఎస్‌యూ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి.

అనవసర భయాందోళనలను నివారించటానికి పౌరులు, మీడియా సంస్థలు కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, ఖచ్చితమైన సమాచారాన్ని అందరికీ తెలియజేయటంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### సముద్ర భద్రత, షిప్పింగ్ కార్యకలాపాలు

పశ్చిమాసియా ప్రాంతంలో ప్రయాణించే భారత నౌకలు, నౌకాయాన సిబ్బంది భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. సముద్రయాన కార్యకలాపాలు సాఫీగా సాగేలా చూసేందుకు షిప్పింగ్ అధికారులు, పరిశ్రమల్లోని ఇతర భాగస్వాములతో సమన్వయం కొనసాగుతోంది.

ఆ ప్రాంతంలో భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నారు. గత 24 గంటలుగా భారత నావికులు, నౌకాయాన ప్రమాదాలు ఎదుర్కొన్నట్లు నివేదికలు లేవు.

మార్చి 14, 2026న భారత నౌక జగ్ లాడ్కి.. ఫుజైరా సింగిల్ పాయింట్ మూరింగ్ వద్ద ముడి చమురును లోడ్ చేస్తున్న సమయంలో ఫుజైరా ఆయిల్ టెర్మినల్‌పై దాడి జరిగింది. ఆ నౌక సుమారు 80,800 మెట్రిక్ టన్నుల ముర్బాన్ ముడి చమురుతో ఈ రోజు ఉదయం 10:30 గంటలకు (ఐఎస్‌టీ) ఫుజైరా నుంచి సురక్షితంగా బయలుదేరి భారత్‌కు పయనమైంది. నౌక, అందులోని భారత సిబ్బంది సురక్షితంగా ఉన్నారు.

సుమారు 92,712 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ లోడ్‌తో వస్తున్న శివాలిక్, నందాదేవి.. రెండు భారత గ్యాస్ వాహక నౌకలు మార్చి 14, 2026న హోర్ముజ్ జలసంధిని దాటాయి. ప్రస్తుతం ఇవి భారత్ వైపు పయనిస్తున్నాయి. మార్చి 16న ముంద్రా ఓడరేవుకు శివాలిక్, మార్చి 17న కాండ్లా ఓడరేవుకు నందాదేవి చేరుకోవాల్సి ఉంది.

ప్రస్తుతం 611 మంది భారత నౌకాయాన సిబ్బందితో కూడిన 22 భారతదేశ ఓడలు పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఉన్నాయి. ఓడ యజమానులు, ఆర్‌పీఎస్ఎల్ ఏజెన్సీలు, భారతీయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ షిప్పింగ్ డైరెక్టరేట్ జనరల్ ఈ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూం ప్రారంభమైనప్పటి నుంచి సమాచారం, సహాయం కోరుతూ.. నావికులు, వారి కుటుంబ సభ్యులు, సముద్రయాన సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన 2,995 ఫోన్ కాల్స్, 5,357కు పైగా ఈమెయిల్స్ ద్వారా సమాచారం అందించారు.

ఇప్పటివరకు గల్ఫ్ ప్రాంతం నుంచి 276 మంది భారత నావికులను షిప్పింగ్ డైరెక్టరేట్ జనరల్ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. గడిచిన 24 గంటల్లో వివిధ విమానాశ్రయాలు, ప్రాంతీయ ప్రాంతాల నుంచి స్వదేశానికి చేరిన 23 మంది నావికులు చేరారు.

ప్రస్తుతం సముద్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా నౌకాశ్రయాలన్నీ.. నౌకల రాకపోకలను, కార్గో ఆపరేషన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.

భారత నావికుల భద్రత, సంక్షేమంతో పాటు నౌకా వాణిజ్యం, ఓడరేవు కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగేలా చూస్తూనే.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయాలు, షిప్పింగ్ కంపెనీలు, సముద్రయాన సంబంధిత సంస్థలతో సంబంధిత మంత్రిత్వ శాఖ నిరంతరం సమన్వయం చేసుకుంటోంది.

భారత రాయబార కార్యాలయాలు, ఇతర కార్యాలయాలు అక్కడున్న భారత ప్రజలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాయి. భారత పౌరుల భద్రత, క్షేమం కోసం అవసరమైన సూచనలు జారీ చేస్తూనే ఉన్నాయి.

పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిరంతరం నిశితంగా గమనిస్తోంది. ఆ ప్రాంతంలోని భారత పౌరుల రక్షణ, క్షేమం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది.

భారత పౌరులు, వారి కుటుంబసభ్యుల సందేహాల నివృత్తికి ఎంఈఏ ప్రత్యేక సహాయక కేంద్రాన్ని నిరంతరం నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సమన్వయం కొనసాగిస్తోంది.

ఆ ప్రాంతంలోని భారత రాయబార కార్యాలయాలు, కేంద్రాలు 24x7 హెల్ప్‌లైన్లను నిర్వహిస్తూ.. భారత సమాజానికి సంబంధించిన సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఎప్పటికప్పుడు ఆదేశాలను జారీ చేస్తున్నాయి.

విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు స్థానిక అధికారులను నిరంతరం సంప్రదిస్తూ.. అక్కడ చిక్కుకుపోయిన భారతీయులకు, సందర్శకులకు అవసరమైన వీసా, రవాణా ఏర్పాట్లు, ప్రయాణ సౌకర్యాలను కల్పిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని భారత నౌకాయాన సిబ్బందికి కూడా సహాయ సహకారాలను అందిస్తున్నాయి.

ఫిబ్రవరి 28, 2026 నుంచి ఇప్పటివరకు పశ్చిమాసియా ప్రాంతం నుంచి సుమారు 1,94,000 మంది ప్రయాణికులు భారత్‌కు తిరిగి వచ్చారు.

యూఏఈ పౌర విమానయాన అధికారుల ఆదేశాల మేరకు యూఏఈ విమానయాన సంస్థలు.. షెడ్యూల్ మార్చి, పరిమితంగా సర్వీసులను నడుపుతున్నాయి. అబుదాబి, దుబాయ్, రస్ అల్ ఖైమా, షార్జా, ఫుజైరా నుంచి భారతదేశంలోని వివిధ నగరాలకు విమానాలు నడుస్తున్నాయి. విమాన సర్వీసులకు సంబంధించిన తాజా సమాచారం కోసం సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించారు.

సౌదీ అరేబియాలోని వివిధ విమానాశ్రయాల నుంచి భారత్‌లోని పలు ప్రాంతాలకు విమాన సర్వీసులు నడుస్తున్నాయి.

ఒమన్ నుంచి భారత్‌లోని పలు ప్రాంతాలకు విమాన సర్వీసులు నడుస్తున్నాయి.

ఖతార్ గగనతలం పాక్షికంగా తెరుచుకోవటంతో ఖతార్ ఎయిర్‌వేస్, భారత్‌కు పరిమితంగా విమాన సర్వీసులను నడుపుతోంది. ఈ క్రమంలో ఇవాళ ఢిల్లీకి ఒక విమానాన్ని నడిపింది.

గగనతలాల మూసివేత కారణంగా బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లో చిక్కుకున్న భారత పౌరులు, సౌదీ అరేబియా మీదుగా ప్రయాణాన్ని కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదివరకు జరిగిన ఘటనలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఘర్షణల వల్ల అయిదుగురు భారత పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఒక భారత పౌరుడు గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం, మరణించిన వారి భౌతికకాయాలను వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఒమన్, ఇరాక్, యూఏఈలోని భారత రాయబార కార్యాలయాలు.. సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి.

సంబంధిత మంత్రిత్వ శాఖలు, సంస్థల మధ్య సమన్వయాన్ని కొనసాగిస్తూ.. కీలక రంగాల్లో సంసిద్ధతను పెంపొందించటానికి, దేశ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపడుతోంది.

# ఈ 17 నుండి సింగరేణిలో ఆందోళన కార్యక్రమాలకు ఏఐటీయూసీ పిలుపు



ఖమ్మం, మార్చి 16: సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం వైఫల్యం చెందినందున గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. సోమవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా పివికే 5 గనిలో జరిగిన వాల్ పోస్టర్ ను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు విడుదల చేసి మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కొన్ని సమస్యలను స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించి ఇంతవరకు వాటి అమలు కోసం యాజమాన్యం సర్క్యులర్లు జారీ చేయలేదన్నారు. ముఖ్యంగా మారుపేర్లు విజిలెన్స్ కేసుల సమస్య, సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఇన్‌కమ్ ట్యాక్స్ సమస్య, డిస్మిస్ కార్మికులకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని కనుక భవిష్యత్ కార్యాచరణ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు.

ఏఐటీయూసీ ఈ నెల 17 నుండి 30 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను, ఏప్రిల్‌లో జరగబోయే సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కావున జరగబోయే ఆందోళన కార్యక్రమంలో పివికే5 గని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సింగరేణి మనుగడను కాపాడాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు, ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి భూక్యా రమేశ్, పిట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.నాగేశ్వరావు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సందీప్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి సాయి పవన్, రాంచందర్, సురేందర్ రెడ్డి, సంజీవ్, విక్రమ్, సుమన్, సంతానం, రామారావు, విజయ్, శ్రీను, శశి, భద్రయ్య, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# 'బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ కాల్వలు పూర్తి చేసి నీరందించాలి'

## – మునుగోడులో రైతాంగ ధర్నా, భారీ ర్యాలీ



నల్గొండ, మార్చి 16: బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ కాల్వలు పూర్తి చేసి సాగునీరు అందించాలని అలాగే మునుగోడు మండలంలోని చెరువులు నింపి తమ పంట పొలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని ఆ ప్రాంత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మునుగోడు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి, కలవలపల్లి మాజీ సర్పంచ్, రైతు గట్టుపల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో అనేక మంది రైతులు భూగర్భ జలాలపై ఆధారపడి వరి పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. కాగా భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కావునా ఉదయ సముద్రం ప్రాజెక్ట్ కాల్వలు పూర్తి చేసి మునుగోడు మండలానికి నీరు అందించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉదయ సముద్రం రైతాంగ వేదిక ద్వారా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పోలగోని సత్యం, బోలుగురి నరసింహ, సురిగి చలపతి, గురిజ రామచంద్రం, పోలగోని సైదులు గౌడ్, గజ్జల బాలరాజు, సుధాకర్, గోస్కొండ లింగయ్య, బూడిద లింగయ్య యాదవ్, జాజుల అంజయ్య, చిలుముల రాజు, చావల శ్రీను, నన్నూరి వెంకటరెడ్డి, జిట్టగోని సైదులు, బొల్లు సైదులు, బండారు శ్రీనివాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# 'ప్రజా వైద్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు'

**–రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని వంద పడకలుగా మార్చాలి**

**– సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్**

**–ప్రారంభమైన సిపిఎం నిర్వదిక నిరాహార దీక్షలు**

నల్గొండ, మార్చి 16:రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చి అసెంబ్లీ సమావేశాల్లో రూ.40 కోట్లు నిధుల కేటాయించి పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం రాష్ట్ర



కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరవధిక నిరాహార దీక్షలు సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి గేటు ముందు ప్రారంభించడం జరిగింది. సిపిఎం మండల నాయకులు 8 మంది దీక్షలో కూర్చోగా వారికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లేక అశోక్ రెడ్డి పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మౌలిక వసతులు లేక ఈ ప్రాంత ప్రజలకు ప్రజా వైద్యం అందకుండా పోతుందని, అత్యవసర పరిస్థితి వస్తే దూర ప్రాంతాలకు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. నియోజకవర్గ కేంద్రంగా 8 మండలాల గ్రామాల ప్రజలకు 56 సంవత్సరాల నుండి వైద్య సేవలు అందించిన ప్రభుత్వ ఆసుపత్రి నేడు పరిమితమైన పాత భవనంలో ఎప్పుడు కోలుతుందో తెలియని ప్రమాదపు అంచుల్లో ఉందన్నారు. ఏరియా ఆసుపత్రి బోర్డు పెట్టి 10 సంవత్సరాలు గడుస్తున్నా ఆచరణకు నోచుకోలేదన్నారు. 50 పడకల కోసం అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శిలాఫలకం వేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కనీసం నిధులు రాక దుర్భర పరిస్థితిలో ఉందన్నారు.

ఈ ప్రభుత్వాసుపత్రి ప్రథమ చికిత్స, పోస్టుమార్టంలకే పరిమితమైంది తప్ప పేదలకు వైద్యం అందడం లేదని వాపోయారు. ప్రతిరోజు 400 మంది ఔట్ పేషెంట్లు వైద్యం కోసం వస్తారని రోగుల సంఖ్యకు అనుగుణంగా డాక్టర్లు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. గర్భిణీలకు కనీసం స్కానింగ్ లేకపోవడంతో ప్రతిసారి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని, ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గిందని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన స్పందించి ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో రూ.40 కోట్లు కేటాయించి వంద పడకల నూతన భవనం నిర్మించి కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆసుపత్రిపై స్పష్టమైన ప్రకటన చేసేదాకా నిరాహార దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

### నిరవధిక నిరాహార దీక్షలో కూర్చున్న నాయకులు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జలల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర నరసింహాచారి, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగె సోములు, నాగటి ఉపేందర్, వేముల సైదులు, చానకొండ రాము ఉన్నారు. ఈ దీక్షలకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఫజల్ బేగ్, నకిరేకంటి గణేశ్, దండుగుల రాములు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు గాజుల ఆంజనేయులు సంఘీభావం తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్గూరి అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, కల్లూరి నగేష్, జంపాల అండాలు, మండల నాయకులు గన్నేబోయిన విజయభాస్కర్, నీల అయిలయ్య, ఎండీ రషీద్, గాదె నరేందర్, ఆవనగంటి నగేష్, బొడిగె రజిత, తొలుపునూరి శ్రీనివాస్, మేడి గణేష్, శాఖ కార్యదర్శులు మునికుంట్ల లెనిన్, తాళ్లపల్లి జితేందర్, పులి భిక్షం, గుండాల ప్రసాద్, పాల్గొన్నారు.

# 'యుద్ధాన్ని నిలిపి ప్రపంచ శాంతి నెలకొల్పాలి'

నల్గొండ, మార్చి 16:అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై చేస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ ఆధ్వర్యంలో పెన్షన్ భవన్ నుండి ర్యాలీగా బయల్దేరి "ప్రపంచ శాంతి వర్ధిల్లాలి ""యుద్ధోన్మాదం నశించాలని నినాదాలు చేస్తూ ప్రధాన రహదారిపై జడ్పీహెచ్ఎస్, కోదాడ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచమంతా వసుదైక కుటుంబంలా కలిసి ఉన్న ఈ తరుణంలో యుద్ధం వల్ల అనేక రకాల ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. మన దేశంలో పెట్రోల్, వంటగ్యాస్ కొరతతో పాటు నిత్యవసరాల సమస్యలు తలెత్తుతున్నాయని, ఇతర దేశాల్లో ఆహారం కొరత ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు ప్రపంచం దేశాల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వెంటనే యుద్ధాన్ని నిలిపి శాంతిని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి తమ్మనబోయిన వీరబాబు, అసోసియేట్ అధ్యక్షుడు వి.జానయ్య, ఉపాధ్యక్షులు గులాం, ఎస్తాని, భ్రమరాంబ, హాజీనాయక్, భూపాల్ రెడ్డి, బాలేమియా, మణి, రామ్, తదితర కార్యవర్గ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి నాళం కృష్ణారావు



మార్చి 17...నాళం కృష్ణారావు వర్ధంతి

నాళం కృష్ణారావు (జనవరి 18 , 1881 - మార్చి 17, 1961) బాల సాహిత్యబ్రహ్మ, మధుర కవి. తెలుగు వైతాళికుడు. సంఘ సంస్కర్త. గౌతమీ గ్రంథాలయం స్థాపకు డు. "మానవసేవ" పత్రిక సంపాదకులు. స్వాతంత్ర్య సమర యోధుడు, బహు భాషావేత్త.

బ్రహ్మ సమాజం మతస్థుడిగా తన గురువు అయిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి కన్నా ముందే జంధ్యాన్ని పరి త్యజించారు. స్త్రీ విద్యను ప్రోత్స హించారు. వితంతు వివాహాలు జరిపించారు. ఇతర కులస్థులతో తన పెద్ద కుమారునికి వివాహం జరిపించారు. చింతా శేషయ్య అనే అట్టడుగు కులస్థుడికి తన యింట్లో నివాసం ఏర్పరిచి బ్రహ్మ మతస్థుడిగా తీర్చిదిద్దారు.

ఇక సాహిత్యం విషయానికి వస్తే...నాళం కృష్ణారావు అద్భుతమైన భావుకుడు.

బాలసాహిత్యంలో నాళంది అగ్రస్థానం. ప్రకృతి కవిత్వంలో , భావ కవిత్వంలో నాళంది అందె వేసిన చేయి. అయన పద్యాలు తెలుగు భాషకు సొబగులు. వాటిని చదివితే తెలుగు భాష సుపరిచితమై, పద్య రచనా పాటవం పెరుగుతుంది. వినూత్న భావాలు మదిలో మెదలుతాయి. చిన్న చిన్న కథల్ని తేటగీతి పద్యాల్లో చెప్పటం నాళం ప్రత్యేకత.

ముఖ్యంగా పిల్లలకు తేలికగా అర్థమయ్యే రీతిలో పద్యాలు రచించారు. చిన్ని చిన్ని పదాలతో తేట తెలుగు పలుకుల రుచి చూపించారు. తేటగీతులలో అద్భుత కావ్యరచనలు చేశారు.

నాళం కృష్ణారావు 1881 జనవరి 18 తేదీన నాళం కామరాజు, లక్ష్మమ్మల చివరి సంతానంగా తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో జన్మించారు.

1911-15 ప్రాంతాలలో ఆయన నిర్వహించిన తొలి తెలుగు సచిత్రమాస పత్రిక 'మానవ సేవ'.

పుస్తక పఠనాసక్తిని కలిగించేందుకు 1898వ సంవత్సరంలో రాజమహేంద్రవరంలో వీరేశలింగం గ్రంథ భాండాగారాన్ని నెలకొల్పారు. అదే క్రమంగా వృద్ధి చెంది వసురాయ గ్రంథ మండలిగా మారింది. దానికే సర్వజన గ్రంథ మండలి అనే పేరు కూడా వచ్చింది. ఎలాంటి విచక్షణకు తావు లేకుండా సమాజం లోని సర్వ సభ్యులకు గ్రంథాలయం ప్రవేశాన్ని కలిగించింది.

కృష్ణారావు పదిహేడో ఏట రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఈ గ్రంథాలయమే ఈ నాటికీ అదే పేరుతో ఆంధ్ర దేశంలోని విలువైన, ప్రముఖమైన గ్రంథాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతున్నది. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి అధ్యక్షులుగా, నాళం కృష్ణారావు కార్యదర్శిగా ఉన్న రోజుల్లో స్వర్ణయుగాన్ని చూసింది గౌతమి. శ్రీకృష్ణరాయ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించిన హితకారిణీ సమాజానికి, వీరేశలింగ పాఠశాలకు పంతులు తర్వాత జీవితాంతం అధ్యక్షులుగా పని చేశారు.

ఆయన రాసిన 'గాంధీ విజయధ్వజ నాటకం' (1921), 'గాంధీ దశావతార లీలలు' (1932) గ్రంథాలను బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. పదివేల సామెతలు జాతీయ లోకోక్తులు పేరుతో సేకరిం చారు. కృష్ణారావు లాఠీఛార్జి, జైలు జీవితం మరొక పార్శ్వం సాహిత్యం. బాల్యం నుండి తుదిశ్వాస వరకు తేటగీతులలో కావ్య రచన చేశారు. కృష్ణారావు ఆశలన్నీ భావిభారత పౌరులయిన పిల్లల పైనే ఉండేవి. అందుకే ఆయన కావ్యనాయకుడు పిల్లవాడు. ఆయా 'గోరుముద్దలు', 'మిూగడ తరగలు', 'వెన్నె బుడగలు', 'పాల తరగలు' 'తేనె చినుకలు' తినిపిం చారు. 'వెన్నెల వెలుగులు', 'విరిదండ', 'దీపావళి' 'పాపాయి' లను అందించారు.

మిూగడ తరకలు (కవితాసంకలనం)

గోరుముద్దలు, వెన్న బుడగలు, పాల తరకలు, తేనె చినుకులు,

వెన్నెల వెలుగులు, విరిదండ, దీపావళి, ముద్దు - పాపాయి,

గ్రంథాలయ సూక్తులు, మిత్ర లేఖావళి, అనుతాపము,

దేశమాత పరిదేవనము,

వితంతు వివాహ చరిత్ర,

స్త్రీల యెడ పురుషుల గావించు, పంచ మహా పాతకాలు,

ప్రేమ సాగరము, తెలుగు జాతీయములు, శ్రీ కృష్ణరాయాంధ్ర విజ్ఞాన సర్వస్వము, గాంధీమహాత్ముని దశావతార లీలలు తదితర రచనలు చేశారు. వీటిలో కొన్ని పుస్తకాలను గుంటూరులోని బొమ్మిడాల ఛారిటబుల్ ట్రస్ట్ వారు 2011 లో పునర్ముద్రణ గావించారు.

ఆయన సతీమణి నాళం సుశీలమ్మ తమ విదేశీ వస్త్రాలన్నీ దహనం చేసి, మహాత్ముడు రాజమండ్రి వచ్చినప్పుడు ఆయనకు పండ్లరసం అందించారు.

కృష్ణారావు నిరాడంబరుడు. కీర్తికాంక్షా రహితుడు. 'సేవ'కే ప్రాధాన్యం ఇచ్చిన మనిషి. తమ అనంతరం మానవసేవ చేయాల్సిందిగా, తన తనయ కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మను నిర్దేశించారు. 1961 మార్చి 17 న మరణించారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# కాంగ్రెస్ 6గ్యారెంటీలు అన్ గ్యారెంటీగా మారాయి...

-కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీలతో ప్రజానీకాన్ని మోసం చేసింది...:

-రెండున్నర ఏళ్లయిన 6 గ్యారంటీలను అమలు చేయలేని దుస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం..

-బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర



కరీంనగర్, మార్చి 16: (నేటినిజం ప్రతినిధి) గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మించి నిలువునా మోసం చేసిందని , కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీలు అన్ గ్యారంటీగా మారాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర ఘాటుగా విమర్శించారు. బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం రోజున బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లయిన 6 గ్యారంటీలను అమలు చేయలేని దౌర్భాగ్య పరిస్థితిల్లో ఉందన్నారు. నాడు అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి నేడు ఇచ్చిన వాగ్దానాలు, హామీల పై దాటవేత ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఒక ఫ్రీ బస్సు ను కల్పించి మహిళలకు ప్రతి నెల రూ. 2500 , రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ను ఎగ్గొట్టిందన్నారు' రైతు భరోసా''కు భరోసా లేకుండా పోయిందన్నారు. రైతు భరోసా అందించడానికి అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు. రైతు కూలీల రైతు భరోసా కు మంగళం పాడిందన్నారు. ప్రధానంగా ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలోరూ.15 వేల రైతు భరోసా అందిస్తామని ప్రకటించి రూ.12 వేలకు కుదింపు చేసి రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు. యువ వికాస పథకాన్ని గాలికి వదిలేసి ందన్నారు.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇంటర్నేషనల్ స్కూల్స్ ల ఏర్పాటు వత్తా లేకుండాపోయిందన్నారు. చేయూత " పథకానికి కాంగ్రెస్ సర్కార్ చేయించిందని, పెన్షన్లను పెంచుతామని పెన్షన్ దారులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రూ. 4000 పెన్షన్ ఇవ్వడానికి హస్తం పార్టీకి చేతులు రావడం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇడ్ల స్థలం ఉన్నవారికి 5 లక్షల ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటకెక్కిచ్చిందన్నారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే స్కీంను తూతూ మంత్రంగా అమలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆరూ గ్యారంటీలను అమలు చేయలేని కాంగ్రెస్ సర్కార్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని , రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా 6 గారంటీలను సక్రమంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 6 గ్యారంటీల అమలు కోసం బీజేపీ ప్రజల కు అండగా నిలుస్తుందని, ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటుందని చెప్పారు. ఆరూ గ్యారెంటీ ల అమలు చేసేదాకా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విడిచిపెట్టే ప్రసక్తి లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లా నాయకులు చింతం శ్రీనివాస్, బూట్ల శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, ఎర్రోజు లక్ష్మణ్ , పాశం రాఘవరెడ్డి, బోనాల మోహన్, ఓ బి సి మోర్చా మండల అధ్యక్షులు దురిశెట్టి రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎలుక పెల్లి స్వామి, మండల జనరల్ సెక్రెటరీ గొట్టుముక్కల తిరుపతిరెడ్డి. సీనియర్ నాయకులు వేల్పుల ఓదెలు, పబ్బతిరుపతి, సత్తయ్య కుమార్, హరిక్రిష్ణ కమెరా వెంకటేష్ ,అజయ్, ఈశ్వర చారి జాడి రాజు, రాఘువ రెడ్డి అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ కార్పొరేటర్లకు ఘన సన్మానం

కరీంనగర్, మార్చి 16:కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ రమా సహిత సత్యనారాయణ స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఆలయ అన్నదాన భవనములో ఏర్పాట చేసిన ఈ కార్యక్రమంలో 46 వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, 47 వ డివిజన్ కార్పొరేటర్ గాజ రమ శివరామ్ కార్పొరేటర్లకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికి, పూలమాల వేసి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నూతన కార్పొరేటర్లకు శుభాకాంక్షలు తెలుపుతూ దేవాలయ అభివృద్ధికి సంబంధించిన పలు విన్నపాలను తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు, గౌరవించిన ఆలయ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాన్ని ఒక ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా అన్ని వసతులతో కూడిన ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మల్లికార్జున రాజేందర్ నేతృత్వంలో కమిటీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో 47 వ డివిజన్ కార్పొరేటర్ గాజ రమా శివరామ్ ను దేవాలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిం చుకున్నారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ కమిటీ కార్యనిర్వాహక సభ్యులు కన్నెబోయిన ఓదెలు, పాత శేఖర్, కల్వకుంట్ల ప్రమోద్ కుమార్, దారం చంద్రయ్య, సుధగోని కొండయ్య గౌడ్, బొబ్బిలి శంకర్, రంగు చెన్నయ్య గౌడ్, ఏ. కిరణ్ కుమార్, నాగసముద్రం వాసరయ్య, వేదాంతం సత్యనారాయణ, బండిపెల్లి మారుతి, బొల్లబత్తిని రవీందర్, పురేళ్ళ పాల్గొన్నారు.

# కౌన్సిలర్ తూము మధుకు వార్డు ప్రజల సత్కారం



రాజన్న సిరిసిల్ల, మార్చి 16: నేటినిజం (ప్రతినిధి): గత నెల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించిన 14వ వార్డు కౌన్సిలర్ తూము మధుకు వార్డు ప్రజలు ఘన సన్మానం నిర్వహించారు. సియోన్ షాలోమ్ టెంపుల్ (ప్రార్థన మందిరం) సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థన మందిరం సభ్యులు వార్డు సమస్యలను కౌన్సిలర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వారి ప్రార్థన మందిరం నిర్మాణానికి సహాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన తూము మధు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎల్లవేళలా వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వార్డు ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపడానికి తాను సిద్ధంగా ఉంటానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన వార్డు ప్రజలకు ఈ సందర్భంగా తూము మధు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు ప్లేట్స్ గ్లాసులు వితరణ

నల్గొండ, మార్చి 16: ములకలపల్లి మండల పరిధిలో ముకమామిడి పంచాయతీలో ఎంపియుపిఎస్ గుట్టగూడెం పాఠశాల ఉపాధ్యాయులు అందరూ కలిసి పాఠశాల విద్యార్థులకు ప్లేట్స్, గ్లాస్ లు, ఏడవ తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్స్ వితరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి చేతులు మీదుగా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులందరూ కలిసి విద్యార్థులకు ప్లేట్స్ గ్లాసులు, జామెంట్రీ బాక్స్ లు పంపిణీ చేయడం చాలా సంతోషమని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చక్కటి చదువులను చెప్పే ఉపాధ్యాయులు ఉన్నారని. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తేవాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

# కొడుముంజలో శ్రీ మల్లిఖార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

– బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, మార్చి 16: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామంలో శ్రీశ్రీశ్రీ వేడలమ్మ -కేతలమ్మ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి స్థిర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, చంద్రగిరి సర్పంచ్ ముత్త సంజన?మహేష్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కడారి శంకరయ్య, గ్రామ ఉప సర్పంచ్ వేముల నాగరాజు, వార్డు సభ్యులు లావణ్యరాజు, ఉపాధ్యక్షులు ఎడ్ల హరీష్, సాయినేని మల్లేశం పాల్గొన్నారు. అంజయ్య, ఎడ్ల శ్రీధర్, నాగరాజు, దేవయ్య, బండారి అంజయ్య, విష్ణు, నరేందర్, ఆదిత్య, వెంకటసాయి తదితరులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# మంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

– బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు బీజేపీ వినతి



రాజన్న సిరిసిల్ల, మార్చి 16: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం అర్బన్ ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మిడ్ మానేరు డామ్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.5,04,000 ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అప్పట్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ముంపు గ్రామాల్లో రాత్రి బస చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని బీజేపీ నాయకులు విమర్శించా రు. ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, యువమోర్చా రాష్ట్ర నాయకుడు జింక అనిల్, మండల ప్రధాన కార్యదర్శి గుండెకార్ల లక్ష్మణ్, ఆరేపల్లి ఉపసర్పంచ్ సిలువేని ప్రశాంత్, ఉపాధ్యక్షులు ఎరుగొక్కుల రమేష్, సీనియర్ నాయకులు చల్ల నరసయ్య, రేగుల పరుశురాం, పోచంపల్లి భాను, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గోనె భాస్కర్, మండల కార్యదర్శి కొలనూరి సంజీవరెడ్డి, చొక్కాల మధు, అధికార ప్రతినిధి విశ్వనాథం శ్రీధర్, నాయకులు పెరంగాని మల్లేశం, ముదాం శ్రీనివాస్, చొక్కాల ప్రశాంత్, చర్ల దేవరాజ్, కంసాని రాము, వికాస్, గొడుగు మహేష్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్టీఎస్‌లో చైతన్య స్కూల్ విద్యార్థి ప్రతిభ



రాజన్న సిరిసిల్ల, మార్చి 16: నేటినిజం (ప్రతినిధి): వేములవాడలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఐఎన్టీఎస్ పోటీ పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షల్లో వేములవాడ శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థి కొమ్ము అక్షయ్ వరుణ్ కరీంనగర్ జోన్ స్థాయిలో స్పెషల్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్‌ను గెలుచుకున్నారు. ఈ బహుమతిని జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలలో కూడా అవకాశాలు కల్పిస్తున్నందుకు శ్రీ చైతన్య యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులకు ఒలింపియాడ్ తరహా పరీక్షలపై అవగాహన కల్పించడం శ్రీ చైతన్య విద్యాసంస్థల ప్రత్యేక కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే స్థాయికి ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్రకోల రాజు, అకాడెమిక్ కోఆర్డినేటర్లు ప్రవీణ్, మమతా, ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి, డీన్ అంజయ్య, ప్రైమరీ ఇన్‌చార్జ్ రజిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, పీటీలు సుధాకర్, మారుతి, కవిత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బైక్ రేస్‌లో.. స్కూటీని ఢీకొట్టిన రాయల్ ఎన్‌ఫీల్డ్, విద్యార్థి మృతి

లక్నో, మార్చి 16: యువకుల బైక్ రేసింగ్ విషాదాన్ని మిగిల్చింది. రేసింగ్‌లో పాల్గొన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఆ బైక్ నడిపిన విద్యార్థి మరణించాడు. ( ఈ ప్రమాదానికి సంబంధించిన షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం కొంత మంది యువకులు బైక్ రేసింగ్‌లో పాల్గొన్నారు.

కాగా, 12వ తరగతి చదువుతున్న 17 ఏళ్ల నైతిక్ కుమార్, రాయల్ ఎన్‌ఫీల్డ్ కాంటినెంటల్ జీటీ 650పై బైక్ రేసింగ్ చేశాడు. లక్నోలోని జనేశ్వర్ మిశ్రా పార్క్ వద్దకు బైక్ రేసర్లు చేరుకున్నారు. పార్క్ గేట్ నంబర్ 5 వద్ద రోడ్డుపై ఏదో తప్పించేందుకు నైతిక్ కుమార్ ప్రయత్నించాడు. దీంతో బైక్‌పై నియంత్రణ కోల్పోయాడు. ఎదురుగా వస్తున్న హోండా యాక్టివాను ఢీకొట్టాడు. ఆ తర్వాత డివైడర్‌పై పడటంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి.

మరోవైపు యాక్టివా స్కూటీ రోడ్డుపై జారిపడింది. బైక్ రేసింగ్ చేస్తున్న మరో యువకుడి కవాసకి నింజాను అది ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ రేసర్‌తోపాటు స్కూటీ నడిపిన వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్ విద్యుత్ శాఖలో ఇంజినీర్ కుమారుడైన తీవ్రంగా గాయపడిన నైతిక్ కుమార్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com